ఆదివారం
15-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 204
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



చీరాలలో జల్లి విల్సన్, సింగరకొండ తదితర నాయకత్వంలో జీవో ప్రతులు దగ్ధం

నారావారిపల్లెలో జీవోను దగ్ధం చేస్తున్న చంద్రబాబు టిడిపి నాయకులు

భోగిమంటల్లో జీవో వన్

- రాజకీయాలకతీతంగా పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు
- ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- లేనిపక్షంలో ప్రజాగ్రహానికి మసికాక తప్పదని నేతల హెచ్చరిక

రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజాస్వామిక హక్కులను కాలరాసేలా జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.1ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శ్రేణులు భోగిమంటల్లో జీవో ప్రతులను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో సీపీఐ, ప్రజా సంఘాల కార్యకర్తలతో పాటు, సీపీఎం, టీడీపీ తదితర అన్ని పార్టీలకు చెందిన ప్రజలు రాజకీయాలకతీతంగా పెద్దసంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ఎండగట్టారు. జీవో 1ని వెంటనే ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వ పతనం ఖాయమని నేతలు స్పష్టం చేశారు. రాజ్యాంగ హక్కులను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎటువంటి త్యాగాలకైనా వెనుకాడబోమని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేసిన తప్పును సరిదిద్దుకోకపోతే ప్రజాగ్రహానికి మసికాక తప్పదని హెచ్చరించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తన స్వగ్రామమైన నారావారిపల్లెలో భోగిమంటల్లో జీవో ప్రతులను వేసి తగులబెట్టగా, ఒంగోలులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, చీరాలలో సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్, కర్నూలు జిల్లా పత్తికొండలో పి.రామచంద్రయ్య, ఏలూరులో డేగా ప్రభాకర్, నూజివీడులో అమర్‌భవన్ వద్ద సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, తుళ్లూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్, గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు తదితరులు జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే జీవో : జల్లి విల్సన్

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వైసీపీ ప్రభుత్వం జీవో 1ని తీసుకొచ్చిందని జల్లి విల్సన్ విమర్శించారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో సీపీఐ,ఏఐటీయూసీ నాయకులతో కలిసి బస్టాండ్ నుంచి గడియార స్థంభం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవో నెం.1 ప్రతులను గడయార స్థంభం సెంటర్లో జల్లి విల్సన్, పార్టీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857లో సిపాయిల తిరుగుబాటును అణిచివేసే

- మిగతా 2 లో

కొండెక్కిన ధరలు
ఆవిరైన ఆశలు!

- పేదల్లో కానరాని సంక్రాంతి శోభ
- అందుబాటులో లేని నిత్యావసరాలు
- నైరాశ్యంలో మధ్యతరగతి కుటుంబాలు
- 'మాండస్'తో బక్కచిక్కిన రైతు
- నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర-డిజిటల్: తెలుగు రాష్ట్రాల్లో సంతోషాల సంక్రాంతి ఈ ఏడాది పేదలకు పస్తులనే మిగిల్చింది. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. పప్పు, బెల్లం, నూనె తదితర నిత్యావసరాల ధరలు ఆకాశం నుంచి దిగిరాకపోవడంతో పిండి వంటలకు పేదలు దూరమయ్యారు. సంక్రాంతి అంటే అరిసెలు, పిండివంటలు చేసుకోవడం సంప్రదాయం. అయితే, ప్రస్తుత పరిస్థితి కొత్త అల్లుళ్లకు సైతం పిండి వంటలు రుచి చూపించలేని పరిస్థితి. ఏ వస్తువు కొనాలన్నా ధరలు కొండెక్కి కూర్చోవడంతో సంక్రాంతి సంబరాలు ఆవిరైపోయాయి. పేదల్లో ఆనందం పండించే పండుగ... గొప్పోళ్లకే పరిమితమైంది. కాయకష్టం చేస్తూ ధాన్యం పండించే రైతన్నపై మాండస్ తుపాను విరుచుకుపడటం, మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవడంతో బక్కచిక్కిన రైతు పండుగ రోజున ఆకాశం వైపు చూడడం తప్ప సంబరాలవైపు కన్నెత్తి చూసే భాగ్యం కరువైంది. నానాటికీ నిత్యావసరాలు ఆకాశాన్నంటడం, పేద, మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో సంక్రాంతి పండుగ వెలవెల బోతోంది. వాస్తవ కొరతకు కృతిమ కొరత తోడుకావడంతో విలవిల్లాడుతున్నారు. ధరలు పెరిగినంత

- మిగతా 2 లో

నెత్తురోడిన బరులు

- తొలిరోజే రూ.100 కోట్ల వ్యాపారం
- అందుబాటులో ఎల్ఈడీ స్క్రీన్లు, విద్యుత్ లైట్లు
- ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖుల రాక
- లాడ్జిలు, హోటళ్లు ఫుల్లు
- పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: సంక్రాంతి వేళ రాష్ట్రంలో కోడిపందాలు జోరుగా సాగాయి. తొలిరోజు భోగి పండగ నాడే బరులు నెత్తురోడాయి. ప్రత్యేకించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్భయంగా, నిరాటంకంగా, అధికార యంత్రాంగం ఆదేశాలు లెక్కచేయకుండా జూదం మూడు పువ్వులు-ఆరుకాయలుగా సాగింది. సంక్రాంతి సంబరాల్లో సంప్రదాయక కోడిపందాలకు స్వస్తి చెప్పడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమైంది. కోడిపందాల నిర్వాహకులు పోలీసుల ఆంక్షలను బేఖాతరు చేశారు. కత్తులు కట్టి కోళ్లను బరిలోకి దించారు. యధేచ్ఛగా కోడిపందాలు

- మిగతా 2 లో

సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే
ప్రధాన పాత్ర

- బీజేపీకి ప్రత్యామ్నాయం లేదనడం పొరపాటు
- సీఏఏతో ముస్లింల అణచివేత
- కాంగ్రెస్ గెలుపు సందేహాత్మకం
- పీటీఐ ఇంటర్వ్యూలో ఆర్థికవేత్త అమర్త్య సేన్



కోల్‌కతా: దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయమే లేదని అనుకోవడం తప్పని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే కీలకపాత్ర పోషిస్తాయని, బలహీనమైన కారణంగా కాంగ్రెస్ గెలుపు సందేహాత్మకమని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ (90) అన్నారు. ఆయన పీటీఐకిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రస్తుత రాజకీయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా

- మిగతా 2 లో

నేటి నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్

- ఉదయం 10.30కి సికింద్రాబాద్ నుంచి ప్రారంభం
- గందరగోళపరుస్తున్న చార్జీల వ్యత్యాసం

2లో

ఇదీ లోకం!



చాలా బాగుంది కదా ! ఒప్పుకో !

పెరూ అధ్యక్షురాలు డినా బోలువార్టే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు లిమా రాజధాని పెరూలో నిరసన చేపట్టారు. పెరూ మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో అరెస్ట్ అనంతరం గతేడాది డిసెంబర్ నుండి దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు చెలరేగుతున్నాయి.

వివరాలు 2లో

ట్యునీషియాలో వెల్లువెత్తిన ప్రజాగ్రహం

ట్యునిస్: ట్యునీషియాలో 2011 తిరుగుబాటు వార్షికోత్సవం సందర్భంగా ట్యునీషియా అధ్యక్షుడు కైస్ సయీద్‌కు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. అధ్యక్షుడు కైస్ సయీద్‌పై పెరుగుతున్న నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా వేలాది మంది నిరసనకారులు ట్యునీషియా రాజధాని ట్యునిస్‌లో పెద్ద ఎత్తున ప్రదర్శన చేశారు. సయీద్ పదవీవిరమణ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం వేలాది మంది నిరసనకారులు ట్యునీషియా జెండాలను ఊపుతూ, సయీత్ పాలన పతనానికి నాందిగా పేర్కొంటూ నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనలో వివిధరాజకీయ పార్టీలు, పౌర సమాజసంస్థలు భారీ ఎత్తున పాల్గొన్నాయి.

అధ్యక్ష భవనం వద్ద నిరసనకారులు మెటల్ బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వాటర్ క్యానన్‌లను ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నిచారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరగడంతో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో ప్రజలు సయీద్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిరు. దేశంలో తాజాగా ఎరుగుతున్న ఆహార ధరలు, ఇంధనం, చక్కెర, కూరగాయలు, నూనె, బియ్యం వంటి ప్రాథమిక ఆహార పదార్థాల కొరతతో ట్యునీషియన్లు తీవ్ర అసంతృప్తిగాఉన్నారు.

పెరూ ప్రభుత్వ రాజీనామాకు భారీ ర్యాలీ

లిమా: పెరూ అధ్యక్షురాలు డినా బోలువార్టే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు లిమా రాజధాని పెరూలో నిరసన చేపట్టారు. పెరూ మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో అరెస్ట్ అనంతరం గతేడాది డిసెంబర్ నుండి దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు చెలరేగుతున్నాయి. ముందస్తు ఎన్నికలు జరపాలని, కాస్టిల్లోను విడుదల చేయాలని, నూతన అధ్యక్షురాలిగా డినా బోలువార్టే రాజీనామా చేయాలంటూ నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. తిరుగుబాటు ఆరోపణలపై కాస్టిల్లో 18నెలల ముందస్తు నిర్బంధంలో ఉన్నారు. ఈ ఆరోపణలను కాస్టెల్లో తిరస్కరిస్తున్నారు. తాజాగా ఈ నిరసనలు ప్రారంభమైనప్పటి నుంచి 329 మంది పౌరులు అరెస్టయ్యారు. 176 మంది పోలీసు అధికారులు గాయపడ్డారు. ఈ నిరసనల్లో 41 మంది పౌరులతోపాటు, ఒక పోలీసు అధికారి మృతి చెందారు. ఈ నిరసన కార్యక్రమాల ప్రమాదాల్లో మరో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

నేటి నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్

ఉదయం 10.30కి సికింద్రాబాద్ నుంచి ప్రారంభం

రేపటి నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి

గందరగోళపరుస్తున్న చార్జీల వ్యత్యాసం

విశాలాంధ్ర-విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం ప్రారంభం కానుంది. సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలును దిల్లీ నుంచి ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. 16వ తేదీ సోమవారం నుంచి ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది. ఆదివారం మినహా వారంలో ఆరు రోజుల పాటు ఈ రైలు సేవలందిస్తుంది. ఈ నెల 19న ప్రారంభం కావాల్సిన ఈ రైలును సంక్రాంతి పండగ కానుకగా నాలుగు రోజులుగా ముందుగానే అందుబాటులోకి తెస్తున్నారు. తాజాగా ఈ రైలు నంబర్, ఆగే స్టేషన్లు, టైంటేబుల్ వివరాలను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి చర్లపల్లి, భువనగిరి, జనగామ, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది (కేవలం 15వ తేదీ మాత్రమే ఈ స్టేషన్‌లలో ఆగుతుంది). రాత్రి 8.45 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. 16వ తేదీ అంటే సోమవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. విశాఖ నుంచి బయలుదేరే వందే భారత్ రైలు (20833) ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఈ రైలు (20834) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. మార్గమధ్యమంలో రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో మొత్తం 14 ఏసీ చైర్ కార్లు సహా రెండు ఎగ్జిక్యూటివ్ ఏసీ చైర్ కార్ కోచ్‌లు ఉంటాయి. మొత్తం 1128 మంది ఒకేసారి ప్రయాణించడానికి వీలుగా ఈ రైలును తీర్చిదిద్దారు.

రైలులో చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ప్రయాణ ఛార్జీలు ఇలావున్నాయి. విశాఖ - సికింద్రాబాద్ మధ్య ఒక్కరికి రూ. 1,720 (చైర్ కార్), రూ.3,170 (ఎగ్జిక్యూటివ్ క్లాస్)కు ఛార్జీ వసూలు చేయనున్నారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు ఒక్కరికి రూ.905 (చైర్ కార్), రూ.1775 (ఎగ్జిక్యూటివ్ క్లాస్) ఇక సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రూ.1365 (చైర్ కార్), రూ.2485 (ఎగ్జిక్యూటివ్ క్లాస్) (క్యాటరింగ్ ఛార్జీలతో కలిపి) టికెట్ ధరలను నిర్ణయించారు. ఈ ఛార్జీలను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. వందే భారత్‌లో ప్రయాణికులకు కేటరింగ్ సదుపాయాన్ని కల్పించారు. ఇందుకోసం చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో రెండు రకాలుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ సదుపాయం ఐచ్ఛికం మాత్రమే. ప్రయాణికులు ఒకవేళ ఆహారం వద్దనుకుంటే కేటరింగ్ ఛార్జీలు ఉండవు.

రైలు చార్జీల్లో వ్యత్యాసం కనిపించడం గందరగోళానికి దారితీస్తోంది. విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు చైర్‌కార్ టికెట్ ధర రూ.1,720, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ టికెట్ ధరను రూ.3,170గా పేర్కొన్నారు. అదే సికింద్రాబాద్ నుంచి బయల్దేరి వెళ్లే రైల్లో చైర్ కార్ టికెట్ ధర రూ.1665, ఎగ్జిక్యూటివ్ క్లాస్ రూ.3,120గా పేర్కొన్నారు. ఈ టికెట్ ధరలను గమనిస్తే స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది. సాధారణంగా అప్ అండ్ డౌన్ ట్రైన్ టికెట్ ధరలు ఒకేలా ఉండాల్సిన చోట ఇలా వేర్వేరుగా ఉండడంతో కొందరు గందరగోళానికి గురవుతున్నారు. అయితే, కేటరింగ్‌కు సంబంధించిన ఛార్జీలు వేర్వేరుగా ఉండడంతో ఈ వ్యత్యాసం కనిపిస్తోంది. చార్జీలను పరిశీలిస్తే.. బేస్ ఫేర్ రూ.1207గా నిర్ణయించారు. రిజర్వేషన్ ఛార్జీ రూ.40, సూపర్ ఫాస్ట్ ఛార్జీ రూ.45, మొత్తం జీఎస్టీ రూ.65గా పేర్కొన్నారు. రైల్లో సరఫరా చేసే ఆహార పదార్థాలకు రూ.308 చొప్పున ఒక్కో ప్రయాణికుడి నుంచి ఛార్జీ చేయనున్నారు. అదే విశాఖ- సికింద్రాబాద్ రైల్లో బేస్ ఛార్జీని రూ.1206గా పేర్కొన్నారు. కేటరింగ్ ఛార్జీని మాత్రం 364గా పేర్కొన్నారు. ఇక్కడే టికెట్ ధరలో 60 రూపాయల వ్యత్యాసం కనిపిస్తోంది. సికింద్రాబాద్- విశాఖ వెళ్లే రైల్లో ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ధరను పరిశీలిస్తే.. బేస్ ఫేర్ రూ.2,485గా పేర్కొన్నారు. రిజర్వేషన్ ఛార్జీ రూ.60, సూపర్ ఫాస్ట్ ఛార్జీ రూ.75, జీఎస్టీ రూ.131గా పేర్కొన్నారు. కేటరింగ్‌కు రూ.369 వసూలు చేస్తున్నారు. అదే విశాఖ నుంచి బయల్దేరే రైల్లో కేటరింగ్ ఛార్జీని రూ.419గా పేర్కొన్నారు. ఇక్కడ కూడా కేటరింగ్ ఛార్జీల్లో కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. ట్రైన్ షెడ్యూల్‌ను బట్టి అందించే ఆహార పదార్థాల్లో మార్పులు ఉంటాయి. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తారు. ఈ కారణంగానే సికింద్రాబాద్- విశాఖ రైల్లో ఆహార పదార్థాల వ్యత్యాసం కనిపిస్తోంది. ఇక వందేభారత్ రైల్లో ఎలాంటి ఆహారపదార్థాలు అందిస్తారనేది తెలియాల్సి ఉంది. సాధారణంగా ఒక్కో రైల్వే జోన్‌లో స్థానిక ఆహారపు అలవాట్లను బట్టి ఒక్కో తరహా ఆహారాన్ని అందిస్తారు. ఒకవేళ టికెట్ బుకింగ్ సమయంలో ఆహారం వద్దనుకుంటే ఆ మొత్తాన్ని టికెట్ ధరలోంచి మినహాయిస్తారు.

ఆవిరైన ఆశలు!

(మొదటిపేజీ తరువాయి)

నిష్పత్తిలో ఆదాయం పెరగకపోవడంతో ఆ ప్రభావం సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన సంక్రాంతిపై పడింది. ఉప్పు, పప్పు తిప్పలు పెడుతుండటం, నూనె ధరలు సలసల కాగుతుండటం, ఉల్లి లొల్లి చేస్తుండటంతో పిండి వంటల జోలికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

ఇవేమీ పట్టవన్నట్టు అటు మోదీ ప్రభుత్వం, ఇటు వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుండటంతో సామాన్యులు పండగ సంతోషానికి దూరమయ్యారు. ఏం కొనేట్టులేదు...ఏం తినేటట్టు లేదన్న సామెత మాదిరిగా ధరలు పెరిగినంతగా ఆదాయం లేకపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం విలవిల్లాడుతున్నారు. గతేడాదితో పోల్చితే ప్రతి వస్తువు ధర 30 నుంచి 40 శాతం మేర పెరగడంతో ప్రజల్లో సంక్రాంతి సంతోషం ఆవిరైపోయింది. ఎన్నికల వేళ ఓట్ల కోసం వలవేసే ప్రభుత్వాలు కనీసం ఏడాదికోసారి జరుపుకునే సంక్రాంతిని దృష్టిలో పెట్టుకునైనా ధరలు నియంత్రించకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఉన్నవాళ్ల సంగతటుంచి బ్లాక్ మార్కెట్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో తాము ఎలా సంతోషంగా సంక్రాంతి జరుపుకోవాలని మధ్యతరగతి ప్రజానీకం నిలదీస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని, సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు, పాడి పంటలతో విలసిల్లాలని ప్రధాని, ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలుపుతూ ఉంటారని, ధరలను భారంగా మార్చి భోగభాగ్యాలు, సిరిసంపదలతో తులతూగాలంటే ఎలా సాధ్యపడుతుందో నాయకులే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కొత్త అల్లుడికి మర్యాదలు చేయడం సంక్రాంతి పండగ ప్రత్యేకతనీ, పిండివంటలతో కడుపు నింపాలని ఆశ ఉన్నా... ప్రస్తుత పరిస్థితులు అందుకు సహకరించడం లేదని ఓ మహిళ తన ఆవేదన వెళ్లగక్కింది. గత ప్రభుత్వం మాదిరిగా సంక్రాంతి కానుక అందజేసినా కొద్దోగొప్పో వండి పెట్టేవారమని, ఇప్పుడు ఆ అవకాశమే లేకుండా పోయిందని వాపోయింది.

బోల్సనారోను విచారించండి

అల్లర్ల కేసులో బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆదేశం

బ్రసిలియా : బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారో విచారణకు రంగం సిద్ధమైంది. ఇటీవల జరిగిన అలర్లపై విచారణ క్రమంలో బోల్సనారోను కూడా విచారించాలని బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అలర్లు జరిగిన రెండు రోజులకు లూలా డ సిల్వా ఎన్నికల్లో గెలుపొందలేదని సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం కలిసి ఆయనను అధ్యక్షుడిని చేశాయంటూ బోల్సనారో ఫేస్‌బుక్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. సుప్రీంకోర్టు, పార్లమెంట్, అధ్యక్ష భవనాలపై బల్సనారో మద్దతుదారులు దాడి చేసి, హింసకు పాల్పడటాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు జరగడంతో ఆయన ఆ వీడియోను తొలగించారు. బోల్సనారో పెట్టిన వీడియోను పేర్కొంటూ, అల్లర్ల దర్యాప్తు క్రమంలో ఆయననూ విచారించాలని ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన అభ్యర్థనకు న్యాయమూర్తి అలెగ్జాండర్ డీ మోరెసే అంగీకారం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన తర్వాత బోల్సనారో తరపు న్యాయవాది ఫ్రెడరిక్ వాసెఫ్ ఒక ప్రకటన చేస్తూ, ఈ నెల 8న జరిగిన విధ్వంసం, హింసాత్మక చర్యలను బోల్సనారో తీవ్రంగా వ్యతిరేకించినట్లు చెప్పారు. అల్లర్లకు పాల్పడిన చొరబాటుదారుల్లో కొంతమంది బోల్సనారో మితవాద మద్దతుదారులు కూడా వున్నారని ఆయన అంగీకరించారు. సుప్రీంకోర్టు, పార్లమెంట్, అధ్యక్ష భవనాలను ముట్టడించి, లోనికి ప్రవేశించేలా అరాచకవాదులను ఎవరు పురిగొల్పారో, వారికి ఎవరు సహకరించారో తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే.

భోగిమంటల్లో జీవో వన్

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంతో భారతీయులు సమావేశం కాకుండా చేసేందుకు బ్రిటీషు ప్రభుత్వం నాడు ఈ తరహా జీవోను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. నేడు మళ్లీ వైసీపీ అటువంటి జీవో తీసుకువచ్చి ప్రజల గొంతును అణిచివేయాలనుకోవటం అత్యంత దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ,వాక్ స్వాతంత్ర్యం ప్రతి పౌరునికి కల్పిస్తే, వైసీపీ ప్రభుత్వం వాటిని హరిస్తూ పౌర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. జీవోపై హైకోర్టులో జరిగే విచారణలో రాష్ట్ర ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకుంటున్నామని అఫిడవిట్ ఇవ్వాలని విల్సన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జెల్లి భాగ్యశ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్, సీపీఐ చీరాల నియోజకవర్గ కార్యదర్శి సీహెచ్ ప్రకాశ్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు, సీపీఐ సీనియర్ నాయకులు మేడా వెంకట్రావు, శ్రీమన్నారాయణ, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

జగన్ నియంతృత్వ పాలనకు పరాకాష్ట : దేగా ప్రభాకర్

జగన్ నియంతృత్వ పాలనకు జీవో నంబరు ఒన్ పరాకాష్టగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలూరులో ఆయన జీవో ప్రతుల దగ్ధం కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, చింతలపూడిలో మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు, జంగారెడ్డిగూడెంలో మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, కొయ్యలగూడెం లో మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, చెల్లుబోయిన రంగారావు, తాడేపల్లిగూడెంలో ఏరియా కన్వీనర్ మండల నాగేశ్వరరావు, తణుకులో పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 1ని రద్దు చేయాలని జీవో ప్రతులను వామపక్షపార్టీల నేతలు భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జీవో ప్రతులను

ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జీవో దగ్ధం చేస్తున్న రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు

తగులబెట్టారు. కనిగిరి, పుల్లలచెరువు, త్రిపురాంతకం, మండలాల్లో సీపీఐ నేతలు కార్యక్రమంలో పాల్గొనగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఒంగోలులో పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతునొక్కే విధంగా ఆ పార్టీలను దెబ్బతీసే విధంగా జీవో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు.

జీవో రద్దు చేయాల్సిందే - పి.రామచంద్రయ్య

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జీవో నంబర్ ఒకటిని రద్దు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. పత్తికొండలో జీవో నంబర్ ఒకటి ప్రతులను భోగిమంటల్లో దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షాలు సభలు సమావేశాలు నిర్వహించకూడదని చీకటి జీవో తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా తీసుకొచ్చిన జీవో నంబర్ ఒకటిని రద్దు చేసేంతవరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, పత్తికొండ, తుగ్గలి మండలాల కార్యదర్శులు డి.రాజాసాహెబ్, సుల్తాన్, పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, సురేంద్రకుమార్, కృష్ణయ్య, రంగన్న, ఎం.కె. సుంకన్న, శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో

ప్రజాస్వామిక హక్కులను కాలరాసే జీవో నంబరు ఒన్ ప్రతులను విజయవాడలోని దాసరి భవన్ వద్ద సీపీఐ నేతలు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, నగర

పత్తికొండలో రామచంద్రయ్య ఆధ్వర్యంలో..

కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, బుట్టి రాయప్ప, నజీర్, లంకా గోవిందరాజులు, ఎస్ఎఫ్ నాయకులు ఓబులేసు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జీవో 1 ప్రతులను పార్టీ శ్రేణులు దగ్ధం చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య నాయకురాలు దుర్గా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తిరువూరులో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎ.కొండూరులో మేకల డేవిడ్, కృష్ణాజిల్లా కూచిపూడిలో దగాని సంగీతరావు, పరుచూరి అజయ్‌కుమార్ తదితరులు జీవో ప్రతులను దగ్ధం చేశారు.

గుంటూరు, బాపట్ల జిల్లాల్లో

బాపట్ల జిల్లా రేపల్లెలో జిల్లా కార్యదర్శి పి.నాగాంజనేయులు, గుంటూరు నగరంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాలో

శ్రీకాకుళం నగరంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో భోగి మంటల్లో జీవో పత్రాలు వేసి నిరసన తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు వారి స్వగ్రామం నిమ్మాడలో భోగి మంటల్లో జీవో ప్రతులను వేసి నిరసన తెలిపారు.

ప్రజా వ్యతిరేక జీవోలను సంఘటితంగా తిప్పికొట్టండి-అక్కినేని వనజ

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజా వ్యతిరేక జీవోలను విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పిస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ హెచ్చరించారు. పౌర హక్కుల వేదిక పిలుపుమేరకు నూజివీడు పార్టీ కార్యాలయం అమర భవన్ వద్ద, పోతిరెడ్డిపల్లి గ్రామ సెంటర్లో భోగిమంటలలో జీవో నంబర్ ఒకటి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణచేసేందుకు అక్రమంగా జీవోలను విడుదల చేస్తున్నదన్నారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను బయటకు తీసుకువచ్చి ప్రతిపక్షాల ఉద్యమాలను అణచివేసేందుకు కొత్త జీవోలను విడుదల చేస్తున్నదన్నారు.ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలందరూ తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, బత్తుల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అక్కినేని బెనర్జీ, అక్కినేని ప్రేమ్ కుమార్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి శిఖా ఆకాష్, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో వనజ,చలసాని, కొమ్మన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో...

నెత్తురోడిన బరులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. కోళ్లకు కత్తులు కట్టవద్దని 20 రోజులుగా ఫ్లెక్సీలు, బ్యానర్లతో పెద్దఎత్తున ప్రచారం చేసినా ఫలితం కనిపించలేదు. ఆశ్చర్యమేమంటే ఆ ఫ్లెక్సీలు, బ్యానర్ల ముందే బరులు నడిపారు. పందెం రాయుళ్లు లక్షల్లో పందాలు కాశారు.. సాక్షాత్తు ప్రజాప్రతినిధులు టీవీలకి ఫోజులిస్తూ కోడిపందాలు ప్రారంభించడంతో పందెం రాయుళ్లు మరింత రెచ్చిపోయారు. గతంలో కోడిపందాలు రహస్యంగా జరిగేవి. ప్రస్తుతం వాట్సాప్ ద్వారా బరుల గురించి ప్రచారం నిర్వహించారు. పాలకపక్షం అండదండలు ఉన్నాయని ముందుగానే ప్రచారం చేసుకున్నారు. భారీగా పందాలు కాసేందుకు పందెం రాయుళ్లు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కంటికి కనపడేది సంస్కృతి, సంప్రదాయం. కనపడకుండా జరిగేది కోట్ల వ్యాపారం. తొలిరోజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.100 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు అంచనా.

మినీ స్టేడియాలను తలపించిన బరులు

ఎక్కువ ప్రదేశాలలో రాత్రిపూట సైతం పందాలు జరిగేలా మిరుమిట్లు గొలిపే విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. అత్యాధునిక సదుపాయాలు గల ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చారు.విద్యుత్ సమస్య లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచారు. వీక్షకులకు సంబంధించిన వేలాది వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. వీటన్నింటితో పాటు బరుల సమీపంలో స్థానిక వ్యాపారులు మద్యాన్ని ఏరులై పారించారు. బరులకు లక్షల్లో బేరాలు జరిగాయి. పందెం

బరులను రహస్యంగా వేలం ద్వారా లక్షల్లో చేజిక్కించుకున్నారు. ఏలూరు నియోజకవర్గం, పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి, భీమవరం, ఆకివీడు, తదితర ప్రాంతాలలో నువ్వా నేనా అన్నట్లుగా బరులకు వేలంపాట జరిగింది. ఒక్కొక్క బరిని రూ.10 లక్షల నుండి రూ.50 లక్షల వరకు పాడారు. కొన్నిచోట్ల బరులకు స్థలాలిచ్చిన యజమానులకు రూ.10 లక్షల వరకు అద్దె చెల్లించినట్లు సమాచారం. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోడి పందాలపై ఆంక్షలు విధించారు. టాస్క్ ఫోర్స్ నియామకం ద్వారా ముందుగానే అధికారులను అప్రమత్తం చేశారు. అయినా పందెం రాయుళ్లు బేఖాతరు చేశారు. తెలంగాణ నుండి రాజకీయ నాయకులు, సినీ హీరోలు, బుల్లితెర నటులు పందాలు తిలకించడానికి తరలివచ్చారు. అలాంటి వారి కోసం సైతం నిర్వాహకులు సకల సదుపాయాలు కల్పించారు.

నగదు మార్పిడికి వీలుగా ఆన్‌లైన్ చెల్లింపుల సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. స్వైపింగ్ మిషన్లు సైతం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు రాజకీయ నాయకులు కావడంతో పోలీసులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి సంక్రాంతి మూడు రోజులు పోలీసులు, మీడియా బరుల వైపు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మరోవైపు, కోడి పందాలు తిలకించడానికి తెలంగాణకు చెందిన ప్రముఖులు, ఔత్సాహికులు, రాజకీయ నాయకులు, బడా కాంట్రాక్టర్లు ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాలలో 15 రోజులు ముందుగానే లాడ్జిలు, హోటల్ గదులను బుక్ చేసుకున్నారు.

పోలీసుల వైఫల్యం

కోడిపందాల నిర్వహణను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ఓవైపు, రాజకీయ ఒత్తిళ్లు, మరోవైపు ఆమ్యామ్యాలు పోలీసుల చేతులు కట్టేస్తున్నాయి. మేమున్నామంటూ అక్కడక్కడా దాడులు చేసి...నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. బడా పందెంరాయుళ్లపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల వత్తిళ్లతో కోడిపందాల నిర్వహణను పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు అడ్డుకునేందుకు సాహసించడం లేదు. కొన్నిచోట్ల ప్రభుత్వ ఉద్యోగులు, చోటామోటా రాజకీయ నాయకులు సైతం కోడిపందాల నిర్వహణలో పాల్గొనడం గమనార్హం.

ప్రధాన పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ముస్లింలను అణచివేయడమే బీజేపీ ఉద్దేశమని చెప్పారు. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికలు ఏకపక్షంగా బీజేపీకి అనుకూలంగా జరుగుతాయంటే పొరపాటే అవుతుందని అమర్త్య సేన్ నొక్కిచెప్పారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై గట్టిగా కృషిచేస్తే అనుకున్న లక్ష్యం సాధించగలవని ఆకాంక్షించారు.
2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు చక్రం తిప్పుతాయని నొక్కిచెప్పారు. ప్రధానయ్యే అన్ని అర్హతలు, సామర్థ్యం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి ఉన్నా బీజేపీ వ్యతిరేక వర్గాలను తనవైపుకు తిప్పుకోగలరా అన్నది ఇప్పుడే చెప్పలేమన్నారు. 'ప్రాంతీయ పార్టీలది కీలక పాత్ర కాబోతోందని, డీఎంకే-టీఎంసీ వంటివి ముఖ్యమైన పార్టీలని, సమాజ్‌వాదీ పార్టీ మద్దతు విస్తరించవచ్చునన్నారు. 'బీజేపీ స్థానాన్ని ఏ పార్టీ భర్తీ చేయలేదని అనుకోవడం పొరపాటు. కేవలం 'హిందూ' విజన్ కారణంగా ఆ పార్టీ ఏలుతుందని భావించడం తప్ప'ని అమర్త్యసేన్ అన్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ), జనతా దళ్ (యూ) వంటి పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి కొత్త కూటమికి పిలుపునిచ్చాయి. 2024 ఎన్నికల్లో బీజేపీని గద్దెదించాలని సంకల్పించాయి. 'భారత విజన్‌ను 'హిందూ భారతానికి'-'హిందీ మాట్లాడే భారతానికి' బీజేపీ పరిమితం చేసింది. ఎంతలా అంటే నేడు బీజేపీకి ప్రత్యామ్నాయమే లేదన్న స్థాయిలో ప్రభావితం చేసింది. బీజేపీ శక్తిమంతంగా కనిపిస్తుండవచ్చుగానీ దానికీ చాలా బలహీనతలు ఉన్నాయి. కాబట్టి ఇతర పార్టీలు వీటిని కనిపెట్టి, సమిష్టిగా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరు' అని సేన్ అన్నారు.
2024 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై ఆయన సందేహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ బలహీనంగా ఉన్నదన్నారు. అయితే ఆలిండియా విజన్ కల్పించగల పార్టీ కూడా అదొక్కటేనని నొక్కిచెప్పారు. కాంగ్రెస్‌లో అంతర్గత పోరునూ ప్రస్తావించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి మాట్లాడుతూ తద్వారా దేశంలోని మైనారిటీల పాత్ర తగ్గిపోతుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయానికి జాతిపిత కృషిచేశారని గుర్తుచేశారు. సీఏఏ అమలు వెనుక బీజేపీ ఉద్దేశం మైనారిటీల పాత్రను ప్రత్యక్షంగా లేక పరోక్షంగా తగ్గించేయడం... హిందూత్వ ఆధిపత్యాన్ని పెంచడమని అమర్త్య సేన్ అన్నారు. నియమ నిబంధనలు రూపొందని కారణంగా ఈ చట్టం ఇంకా అమల్లోకి రాలేదు. బీజేపీ పరిపాలన ఇన్నేళ్లలో మెరుగైందా అన్న ప్రశ్నకు 'నాకేమీ అలా అనిపించలేదు. భారత్‌కు కావాల్సినదల్లా దేశంగా గుర్తింపు... ప్రజాహక్కుల గుర్తింపు.. మహాత్మాగాంధీ ఇందుకోసమే కృషిచేశారు. ఒకసంఘాన్ని మరొక సంఘంపై ఉసగొల్పలేదు.
హిందూ మతవాది అయినాగానీ ముస్లింలను ఎన్నడూ తక్కువ చేయలేదు. సుపరిపాలన-సమన్యాయాన్ని కాంక్షించారు' అని అమర్త్య సేన్ అన్నారు. ముస్లింలు వంటి మైనారిటీ వర్గాన్ని నిర్లక్ష్యం చేసినందుకు భారత్ ఏదో ఒక రోజు పశ్చాత్తాపం పడుతుందని అన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, క్రైస్తవులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు సీఏఏ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. సీఏఏకు పార్లమెంటు ఆమోదం లభించిన తర్వాత దేశవ్యాప్తంగా ముస్లింలు, మేధావులు, విద్యార్థి-యువజన సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు జరిపాయి.
ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసుల కాల్పుల్లో వంద మందికిపైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు.

ప్రజాగ్రహాన్ని గమనించి ఇకనైనా

జీవో 1 ఉపసంహరించాలి

- మంత్రి రోజా హుందాగా మాట్లాడాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హితవు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకువచ్చిన చీకటి జీవో నంబర్ 1పై రాజకీయాలకతీతంగా ప్రజలంతా నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ముఖ్యమంత్రి ఇకనైనా ప్రజాగ్రహాన్ని గమనించి ఆ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. జీవో 1 ప్రతులను రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో భోగి మంటల్లో వేసి దగ్ధం చేసిన ప్రతిపక్ష పార్టీలకు, ప్రజాసంఘాలకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ర్యాలీలు, రోడ్ షోలు, సభలు, ప్రదర్శనలకు అనుమతి నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చీకటి జీవో నంబర్ 1 విడుదల చేసింది. ఇది ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే. 75 సంవత్సరాల దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటివరకు అమలు జరగని విధంగా, కనీసం బ్రిటిష్ కాలంలో కూడా ఇంత నిరంకుశంగా జీవోలు తీసుకు రాలేదని సాక్షాత్తు హైకోర్టే అభిప్రాయపడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు జగన్ సర్కార్ నిరంకుశ విధానంపై భగ్గుమంటున్నాయి. ప్రజా ఉద్యమాల గొంతు నొక్కాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి జీవోను ఉపసంహరించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను భోగిమంటల్లో వేసి తగలబెట్టాలంటూ రాష్ట్ర మంత్రి రోజా చేసిన దురుసు వ్యాఖ్యలను రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిపక్ష స్థానం నుంచి ఎదిగే అధికారానికి వచ్చిందనే విషయాన్ని రోజాకు గుర్తు చేశారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న మంత్రి టీవీ షోలలో మాట్లాడే విధంగా వ్యాఖ్యలు చేయటం సమంజసం కాదన్నారు. ఇకనైనా దిగజారుడు మాటలు మాని హుందాగా వ్యవహరించాలని రోజాకు రామకృష్ణ హితవు చెప్పారు.

చైనా మాంజా అమ్ముతున్న ఇద్దరిపై కేసు

విశాలాంధ్ర-మేడిపల్లి: చైనా మంజ అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. పీర్జాధిగూడ ఎమ్మార్వో ఆఫీసు పక్కన మొడెం రాజు (36) పతంగుల షాప్ ఏర్పాటుచేసి చైనా మాంజా అమ్ముతుండగా అదుపులోనికి తీసుకొని తొమ్మిది షీట్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శ్రీనివాస కర్రీ పాయింట్ వద్ద భీమగొని హరిబాబు (50) తాత్కాలికంగా పతంగుల షాప్ ఏర్పాటు చేసి చైనా మాంజా అమ్ముతుండగా అదుపులోనికి తీసుకొని 30 షీట్ల చైనా మంజా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఎవరైనా చైనా మంజా అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపారు.

విశాలాంధ్ర

3

ఆదివారం

15 జనవరి 2023

సైకో పాలనతో ప్రజల ఇబ్బందులు

- కందుకూరి ఘటన ప్రభుత్వ కుట్ర
- పెద్దిరెడ్డిని గుర్తుపెట్టుకుంటా
- చంద్రబాబు మండిపాటు
- భోగి మంటల్లో జీవో కాపీలు దహనం

విశాలాంధ్ర-చంద్రగిరి: తెలుగు రాష్ట్రాల ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి జిల్లా నారావారిపల్లెలో నిర్వహించిన 'భోగి' వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జీవో నంబరు ఒకటి కాపీలను భోగి మంటల్లో వేసి జగన్ సర్కార్‌కు వ్యతిరేకంగా చంద్రబాబు నిరసన తెలిపారు. పనికిరాని వస్తువులన్నీ 'భోగి' మంటల్లో వేశామని చంద్రబాబు అన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజావేదిక విధ్వంసంతో పాలన మొదలు పెట్టిన సీఎం జగన్... ప్రజలపై పన్నులు, చార్జీల మోత మోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకో పాలన పోవాలని కోరుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. 'నాడు జనాభా నియంత్రణ పద్ధతులను నేను ప్రోత్సహించాను. దీన్ని ప్రజలు స్వీకరించారు. రాష్ట్రంలో రహదారులు దారుణంగా ఉన్నాయి. రోడ్లపై తిరిగి నాకూ నడుం నొప్పి వచ్చింది. అయినా ప్రజా సమస్యలపై తిరగాల్సిందే. నేడు రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కువ పెట్రో ధరలు, ఎక్కువ కరెంట్ చార్జీలు, ఎక్కువ ఇంటి పన్ను, చెత్తపన్ను ఉన్న రాష్ట్రం మనదేనని చంద్రబాబు విమర్శించారు. తాము చేపట్టిన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని చెప్పారు. బిడ్డల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా, అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు పరిపాలన చేయాలన్నారు. కానీ ఈ ప్రభుత్వం తీరు అందుకు పూర్తి భిన్నంగా ఉందన్నారు. 'ప్రశ్నించిన నాపైనా ప్రభుత్వం కేసులు పెడుతోంది. నన్ను అడ్డుకుంటోంది. నా సభలకు బందోబస్తు ఇవ్వడం లేదు' అని ఆరోపించారు. కందుకూరు ప్రమాదానికి కారణం భద్రత ఇవ్వకుండా ప్రభుత్వం చేసిన కుట్ర అని ఆరోపించారు. ఇది ప్రభుత్వ కుట్ర కాదా? గుంటూరు సభలో జరిగిన తొక్కిసలాట కూడా కుట్రలో భాగమేనన్నారు. ఇవన్నీ చూపించి జీవో తీసుకువచ్చారని చంద్రబాబు ఆరోపించారు. తాను ప్రజలను కలవకూడదని సీఎం జగన్ భావించారని, అయినా తనకు జగన్‌పై ఎటువంటి ద్వేషం లేదన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్మయుడని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాన్ని సాధించి పెట్టింది పొట్టి శ్రీరాములు అయితే.. వారికి గౌరవం తీసుకొచ్చింది ఎన్టీఆర్ అన్నారు. నాడు తాను ప్రోత్సహించిన ఐటీ సెక్టార్ ఉత్తమ ఫలితాలు ఇచ్చిందని, తెలుగు యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుందని తెలిపారు. కొందరు ఈరోజు కోసం బతుకుతారని, మరికొందరు రేపటి కోసం బతుకుతారని, కానీ తాను మాత్రం ప్రజల రేపటి భవిష్యత్ కోసం బతుకుతానని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డిని గుర్తు పెట్టుకుంటానని, పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై 40 రోజుల్లో 10 కేసులు బనాయించారని ఆరోపించారు. కార్యకర్తలను పండగపూట జైల్లో పెట్టించారని, దీనికి పెద్దిరెడ్డి తప్పక ఫలితం అనుభవిస్తారని చంద్రబాబు అన్నారు. దుర్మార్గాలు చేస్తున్న ప్రతి ఒక్కరి లెక్కలు రాసి పెడుతున్నానన్నారు. టీడీపీ మాజీమంత్రి అమర్నాథ్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం క్యాంప్ కార్యాలయంలో

సంక్రాంతి సంబరాలు

సంప్రదాయ దుస్తులలో సీఎం జగన్ దంపతులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం గోశాల వద్ద శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సీఎం జగన్ దంపతులకు పూర్ణకుంభతో అర్చకులు స్వాగతం పలికారు. గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు, భోగిమంటలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండివంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల సంక్రాంతి నృత్యాలతో వైభవంగా వేడుకలు జరిగాయి. పంచెకట్టు, పై పంచె వంటి సాంప్రదాయ దుస్తులతో సీఎం జగన్, భారతి దంపతులు వేడుకలను ఆసక్తిగా తిలకించారు. రెల్లుగడ్డితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుటీరం వేదికలో సీఎం దంపతులు ఆశీనుల య్యారు. గోశాలలో ఆవులకు, గంగిరెద్దులకు సీఎం స్వయంగా పండ్లు తినిపిం చారు. హరిదాసులకు బియ్యం, పండ్లు, కూరగాయలు దానం చేశారు. భోగి మంటల్లో సతీసమేతంగా పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలను ఆసక్తి తిలకిం చడంతో పాటు, వారితో సెల్ఫీలు దిగి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ వేడుకల్లో పాల్గొన్నవారితో పాటు, రాష్ట్ర ప్రజలందరికీ మరోమారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తన అక్క చెల్లెమ్మలు, అన్నతమ్ముళ్లు, అవ్వాతాతలందరికీ మంచి జరగాలని, దేవుడి ఆశీ స్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. డిప్యూటీ సీఎం (దేవాదాయశాఖ మంత్రి) కొట్టు సత్యనారాయణ, మంత్రి జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

నకిలీ బంగారం బిస్కెట్ల కేసులో ఇద్దరి అరెస్ట్

విశాలాంధ్ర-బేస్తవారిపేట: ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలో ఓ వ్యక్తికి నకిలీ బంగారు బిస్కెట్ అమ్మి మోసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజేశ్ తెలిపారు. కేసు వివరాలను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాధవరావుతో కలిసి సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బేస్తవారిపేట మండలం చిన్న ఓబినేనిపల్లి గ్రామానికి చెందిన కాకర్ల గురువర్ కుమార్ అనే వ్యక్తికి డిసెంబర్ 15వ తేదీన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ఇందిరమ్మ కాలనీకి చెందిన సురేశ్, అచ్చంపేట మండల కేంద్రానికి చెందిన గుంజి కోటేశ్వరమ్మ అలియాస్ కోటమ్మ, మరో మహిళ ఫోన్ ద్వారా పరిచయమయ్యారు. తమ వద్ద బంగారు బిస్కట్ ఉందని, తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి, అతని నుండి 2 లక్షల రూపాయలు తీసుకొని నకిలీ బంగారు బిస్కట్ ఇచ్చారు. అది నకిలీ బంగారు బిస్కెట్ అని తెలుసుకున్న గురువర్ కుమార్...ఈ నెల 11వ తేదీన బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మాధవరావు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్ ఆదేశాలతో మార్కాపురం డీఎస్పీ కిషోర్ కుమార్, కంభం సీఐ రాజేశ్ పర్యవేక్షణలో ఎస్ఐ మాధవరావు సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మండలంలోని పందిళ్లపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం ముద్దాయిలు సురేశ్, కోటేశ్వరమ్మలను అరెస్ట్ చేశారు. మరొకరిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ చెప్పారు. నిందితులు ముగ్గురిపై గతంలో సంతమాగులూరు, పెదనందిపాడు, వాడేపల్లి స్టేషన్లలో అనేక కేసులున్నట్లు ఆయన తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి...బంగారు బిస్కెట్లు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకు ఇస్తానని నమ్మబలికి మోసం చేస్తారని, ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుంటారని, అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. మూడు రోజుల్లోనే కేసు ఛేధించిన ఎస్ఐ మాధవరావును ఉన్నతాధికారులు అభినందించారు.

బరి తెగింపు

- భోగి రోజే కోడికి కత్తి
- ఇబ్రహీంపట్నం పరిధిలో అత్యధికం
- భారీగా పందేలు, విచ్చలవిడిగా పేకాట
- జోరుగా మద్యం అమ్మకాలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: సంక్రాంతి పండుగ ముసుగులో ఎన్‌టీఆర్ జిల్లాలో భోగి రోజు ఉదయమే భారీగా కోడిపందేలు మొదలయ్యాయి. గతంలో సంక్రాంతి రోజు మధ్యాహ్నం తర్వాత కోడి పందేలు ప్రారంభించేవారు. ఈ ఏడాది మాత్రం స్థానిక పోలీసు అధికారులను మచ్చిక చేసుకుని భోగి రోజు కోడికి కత్తి కట్టి బరిలో వదిలారు. సంప్రదాయం పేరిట బరులన్నీ నెత్తురుతో తడిచిపోయాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నడూ లేని విధంగా ఆరు ప్రాంతాల్లో పెద్దఎత్తున బరులు ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్, చిలుకూరు, మూలపాడు, త్రిలోచనాపురం, చిన్నలంక, ఈలప్రోలు, తుమ్మలపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం నుంచే భారీగా కోడి పందేలు ప్రారంభమయ్యాయి. కోడి పందేల పేరుతో 10 నుంచి 20 ఎకరాల్లో టెంట్లు వేసి ఒకవైపు కోడిపందేలు, మరోవైపు పేకాట, ఇతర జూదాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. జోరుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. విజయవాడ నగరానికి కాస్త దూరంగా ఉండటం, పోలీసుల హడావుడి ఉండదనే నమ్మకంతో ఎక్కువ మంది పందెపురాయుళ్లు ఇబ్రహీంపట్నం మండలం వైపు మళ్లారు. అక్కడ ప్రతి బరి వద్ద ప్రవేశ రుసుం రూ.100 నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నారు. నిర్వాహకులు ప్రత్యేకంగా తమ సిబ్బందిని నియమించుకుని పార్కింగ్, ఎంట్రీఫీజు వంటివి వసూలు చేస్తున్నారు. అయినా ఇబ్రహీంపట్నం పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రామలింగేశ్వరనగర్‌లో...

విజయవాడ నగరంలోని భవానీపురంలో కోడిపందేలను గురువారం పోలీసులు పూర్తిగా అడ్డుకున్నారు. మరోవైపు పటమట రామలింగేశ్వరనగర్ శ్మశాన వాటిక రోడ్డులో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కోడిపందేల బరి వద్ద పోలీసులు కాపలా ఉన్నారు. అక్కడ కూడా మధ్యాహ్నం వరకు ఎటువంటి పందేలు నిర్వహించలేదు. అయితే, మధ్యాహ్నం నుంచి కోడిపందేలు ప్రారంభించారు. నగరవాసులు పెద్ద ఎత్తున ఇక్కడికి తరలివచ్చారు. ఉదయం నుంచి కట్టడి చేసిన పోలీసులు... మధ్యాహ్నం తర్వాత కత్తి కట్టి కోడి పందేలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. మరోవైపు విజయవాడ రూరల్ మండలంలోని అనేక గ్రామాల్లోనూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు.

సంక్రాంతి... జూదదినం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో అధికారపార్టీ నేతలు యథేచ్ఛగా కోడిపందేలు, జూదం ఆడిస్తూ వేలాది కుటుంబాలను రోడ్డునపడేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారపార్టీ నేతలు, శాసనసభ్యులు, మంత్రులు ఆధ్వర్యంలోనే పెద్ద ఎత్తున జూద కేంద్రాలను నిర్వహించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న పోలీసులపై సైతం దాడులకు తెగబడుతున్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదా యాలకు చిరునామాగా ఉన్న సంక్రాంతి పండుగను జూద దినంగా మార్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నడిరోడ్లపై టెంట్లు వేసి, రోడ్లను బ్లాక్ చేసి కోడి పందాలు నిర్వహిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను మంటగలిపి సంక్రాంతిని పేకాట కేంద్రంగా మార్చేశారు. కేసినోలు, పేకాట క్లబ్బులు, జూదాలు ప్రవేశపెట్టి యువత భవిష్యత్ ను నాశనం చేస్తున్నారు. రాష్ట్రంలో జూదం లాంటి క్రీడలను జరగనివ్వమంటూ భీషణ ప్రతిజ్ఞలు చేసిన జగన్ రెడ్డి, ఆయన ప్రభుత్వం రెండేళ్ల క్రితం జూదనిరోధక చట్టంపేరుతో తీసుకొచ్చిన బిల్లు ఏమైందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓట్లేసిన ప్రజల యోగక్షేమాలు, రాష్ట్రాభివృద్ధి గురించి పట్టించు కోవడానికి ఏమాత్రం తీరు బడిలేని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇటు వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ కోసం రాత్రి పగలనే తేడా లేకుండా సమయాన్ని వెచ్చిస్తున్నారన్నారు. అధికారపార్టీ నేతలు బరుల నిర్వహణకు ధరలు నిర్ణయిస్తూ సంక్రాంతి మూడు రోజులపాటు జూద క్రీడలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకుంటున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఇకనైన స్పందించి కోడి పందాలు, జూద కేంద్రాలను నిలిపివేయాలని, రాబోయే రెండు రోజులైనా సామాన్యులు సంక్రాంతి సంబరాలు సాఫీగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేపీ రెడ్డయ్యకు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నివాళి
- కారకంపాడు జనసంద్రం

విశాలాంధ్ర-కూచిపూడి: రాజకీయ దురంధరుడు, పార్లమెంటు మాజీ సభ్యులు కేపీ రెడ్డయ్య అంత్య క్రియలు అధికార లాంఛనాలతో శనివారం కృష్ణా జిల్లా మొవ్వ మండలం అయ్యంకి అడ్డరోడ్డు వద్ద గల ఆయన పొలంలో నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కడసారి చూపు కోసం పార్టీలకతీ తంగా వచ్చిన ఆయన అభిమానులతో, బంధుమిత్రు లతో కారకంపాడు గ్రామం రద్దీగా మారింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేశ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్(పామర్రు), పేర్ని వెంకట్రామయ్య (నాని-మచిలీపట్నం), సింహాద్రి రమేశ్‌బాబు (అవనిగడ్డ), సామినేని ఉదయభాను (జగ్గయ్య పేట), జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డీఎస్పీ సత్యానందం, పామర్రు సీఐ వెంకటనారాయణ, ఉయ్యూరు ఆర్‌డీఓ ఎస్.విజయ్ కుమార్, మొవ్వ తహసీల్దారు సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, అధికారుల పర్యవేక్షణలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇక్కడికి వచ్చిన నాయకులు పెనమలూరు శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి కేపీ సారథి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కేపీ రెడ్డయ్య ఇంటి నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. కేపీ రెడ్డయ్య అమర్ రహే.... అనే నినాదాలతో బాణాసంచా కాల్పులు, మేళతాళాల మధ్య అంతిమయాత్ర సాగింది. అంత్య క్రియల క్రతువుని కుమారుడు పార్థసారథి నిర్వహిం చారు. కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము, కృష్ణాజిల్లా వైఎస్‌ఆర్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, నిడుమోలు నియోజవర్గ మాజీ శాసన సభ్యులు పాటూరి రామయ్య, వైఎస్‌ఆర్‌సీపీ విజయ వాడ అర్బన్ మాజీ అధ్యక్షుడు బొప్పన భవ కుమార్, మొవ్వ జడ్‌పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి తాతినేని పూర్ణచంద్రరావు, అయ్యంకి సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్, పామర్రు, అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం తదితర నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అభిమా నులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ రెడ్డయ్య పాడి మోసి...ఆయన పట్ల తనకు గల గౌర వాన్ని కనపరిచారు. ఏఆర్ ఎస్ఐ హరిప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు గాలిలోకి తుపాకులు పేల్చి రెడ్డయ్యకు గౌరవ వందనం చేశారు.

నిబద్ధత గల నేత రెడ్డయ్య: నారాయణ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మచిలీపట్నం మాజీ ఎంపీ కొలుసు పెద రెడ్డయ్య మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ శనివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. "పార్లమెంట్ సభ్యునిగా, శాసన సభ్యునిగా రెడ్డయ్య ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయనతో నాకు ప్రత్యేక సంబంధాలున్నాయి. విద్యుత్ సంస్కరణలు తీసుకురావడంలో, విద్యుత్ చార్జీలు పెంచడానికి ఏర్పాటు చేసిన నియంత్రణా మం డలిలో చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా చురుకైన పాత్ర వహించారు. విద్యుత్ చార్జీల నియంత్రణ మండలి అభిప్రాయ సేకరణ సందర్భంగా ముక్కు సూటిగా వ్యవహరించేవారు. వీపీ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ సిఫార్సులకు అనుకూలంగా నిలిచారు. సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాన్ని వామపక్షాలతో కలిసి ఎదుర్కొ న్నారు. ఆయన మృతితో నిబద్ధత గల నాయకుడిని కోల్పోయాం. ఆయన మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులు సానుభూతిని తెలియజేసున్నాను' అని ఆ ప్రకనటలో నారాయణ పేర్కొన్నారు.

పండగ వేళ విషాదం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

విశాలాంధ్ర-చల్లపల్లి: కృష్ణాజిల్లా చల్లపల్లిలో శు క్రవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఊరంతా పండగ సంతోషంలో ఉంటే ఈ దుర్ఘటనతో ఆ రెండు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కొప్పోళ్ల సత్యనారాయణ(30), గుడి రాజేశ్(37) అక్కడికక్కడే మృతి చెందగా ఆరెపల్లి అశోక్, కొప్పోళ్ల సాయి రవి, మధిర నవీన్ కుమార్ గాయపడ్డారు. ఐదుగురు కారులో చల్లపల్లి నుండి ఘంటసాల మండలం లంకపల్లి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారి మీదుగా కాసానగరం మలుపు వద్ద నుండి చల్లపల్లి వైపు వచ్చి మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా ఈ దుర్ఘటన జరిగింది. పడమర వీధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద కారు అదుపుతప్పి ఆలయ ప్రహరీ గోడను ఢీకొని పల్టీ కొట్టింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చల్లపల్లిలో విషాద ఛాయలు

పండగ పూట ఇద్దరు యువకులు మృతి చెందడంతో చల్లపల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి. కొప్పోళ్ల సత్యనారాయణ (పండు) హైదరాబాదులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఇంటికి వచ్చాడు. కుటుంబమంతా పండగకు సిద్ధమవుతున్న వేళ ఈ సంఘటన జరగడం ఆ కుటుంబాన్ని తీవ్ర దుఃఖసాగరంలో ముంచేసింది. గుడి రాజేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెక్కడితేగానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, పిల్లల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి.

కొడుకు కుమార్తెను నరికి

తండ్రి ఆత్మహత్య

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం నక్కలదిన్నె గ్రామంలో కొడుకు, కుమార్తెను గొడ్డలితో నరికి ఆ తరువాత పరుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న తండ్రి ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు మండలం నక్కలదిన్నె గ్రామంలో నివాసం ఉంటున్న నరసింహారెడ్డి శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న కుమారుడు అఖిల్ తేజారెడ్డి(15), కుమార్తె పాలని(14)ని గొడ్డలితో నరికాడనీ, అనంతరం నరసింహారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. నరసింహారెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విజయవాడలో భారీ చోరీ

- రూ.37 లక్షల బంగారు ఆభరణాలు...
- 12 కేజీల వెండీ దోపిడీ

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: విజయవాడ గవర్నర్‌పేటలో భారీ చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగలకొట్టి రూ.37లక్షల విలువైన బంగారు అభరణాలు, 12 కేజీల వెండీ, లక్ష రూపాయల నగదును దుండగులు దోచుకెళ్లారు. గవర్నర్‌పేట గోపాలరెడ్డి రోడ్డుకు చెందిన చిన్నాగిరి అనంత పద్మనాభం(64) వన్‌టౌన్‌లో ఆయిల్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఈనెల 13వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీ వెళ్లారు. స్థానికులు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో యాజమానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. తన బంధువులు ఇంటికి వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న గవర్నర్‌పేట పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలిం చారు. ఇంటికి ఉన్న మూడు గేట్ల తాళాలు పగలకొట్టి ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

సుప్రీంకోర్టు మాటే బేఖాతరు

మన సమాజం ఎలా ఉండాలని అనుకున్నామో, ఎలా ఉందో చూస్తే సమాజాన్ని వికృతీకరించడంలో విద్వేషప్రచారం ఎంత హానికరంగా తయారైందో అర్థం అవుతుంది. విద్వేష ప్రచారాన్ని నిలవరించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని గురువారం సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు బెంచీలు ఎత్తి చూపాయి. ఒక బెంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నాయకత్వంలో ఉంటే, రెండో బెంచి న్యాయమూర్తి కె.ఎం.జోసెఫ్ నాయకత్యంలోనిది. ఏ మతం ఆసరాగా విద్వేషం రెచ్చగొట్టకూడదని ప్రభుత్వం అంగీకరించింది. ఏ మతం అన్న మాట వాడడంలోనూ విద్వేషానికి కారణం కాని మతాలను కూడా ప్రభుత్వం ఒకే గాటనకట్టి చూపించాలన్న ప్రయత్నం కనిపిస్తోంది. 2021 డిసెంబర్‌లో హరిద్వార్, ఢిల్లీలో రెండు ధర్మసన్సద్‌లు నిర్వహించారు. ఈ ధర్మసన్సద్‌లలో ముస్లింల మీద విద్వేషం విరజిమ్మారు. ఇలాంటి ప్రసంగాలు సమాజాన్ని నిట్టనిలువునా చీల్చేస్తాయి. మెజారిటీ మతం తరఫున మాట్లాడుతున్నాం అనుకునే వారు విద్వేషం పెంచడానికి కృషిచేస్తే దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని గత ఏడెనిమిదేళ్ల పరిస్థితి గమనిస్తే అర్థం అవుతుంది. ఈ ధోరణిపై దేశమంతటా తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయినా ఉత్తరాఖండ్ పోలీసులు, ఢిల్లీ పోలీసులు గాఢ నిద్రలోంచి మేల్కొనకపోవడం విచిత్రంగానే కాదు అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఈ అంశం మీద కొంత మంది సుప్రీంకోర్టుకెళ్లారు. సుప్రీం కోర్టు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడమే కాక జవాబుదార్లుగా ఉండవలసిన వారికి నోటీసులు కూడా జారీచేసింది. విచిత్రం ఏమిటంటే గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టులో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఢిల్లీ పోలీసులు ధర్మసన్సద్‌లో విద్వేష ప్రసంగాలు ఏవీ జరగలేదని బాహాటంగా అబద్ధమాడారు. పైగా విద్వేష ప్రసంగాలు అంటున్న మాటలు ఒక మతం వారిని చైతన్యవంతులను చేయడానికి, ముప్పు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని మాత్రమే హెచ్చరించారని ఢిల్లీ పోలీసులు జంకు, గొంకు లేకుండా సాక్షాత్తు సుప్రీంకోర్టులోనే చెప్పారు. సుప్రీంకోర్టు పోలీసుల దుస్సాహసాన్ని గట్టిగా తప్పుబట్టినప్పుడు ఢిల్లీ పోలీసుల స్వరం 2022 మేలో మారింది. అప్పుడు ఒక ప్రమాణ పత్రం దాఖలు చేసి విద్వేషం రెచ్చగొట్టిన మాట వాస్తవమేనని అంగీకరించారు. కానీ ఇప్పటిదాకా ఈ విషయంలో ఎలాంటి చర్యా తీసుకోకపోవడం అంతకన్నా కఠిన వాస్తవం. గురువారం ఈ అంశం మళ్లీ సుప్రీంకోర్టులో ప్రస్తావనకు వచ్చినప్పుడు ఎనిమిది నెలలు గడిచినా పోలీసులు ఏ చర్యా తీసుకోలేదని రుజువైంది. ఈ అంశం సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ప్రస్తావనకు వచ్చింది. దర్యాప్తు మీరు ఏ విధంగా చేస్తున్నారు అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. విద్వేష ప్రసంగం 2021 డిసెంబర్‌లో జరిగితే ఐదు నెలల తరవాత ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేశారు. ఎనిమిదినెలల తరవాత కూడా మీరు చేసింది ఏమీ లేదుగదా అని సుప్రీంకోర్టు నిలదీసింది. 2022 మే నాలుగు తరవాత మీరేం చర్యలు తీసుకున్నారు అని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. మీరు ఎంతమందిని అరెస్టు చేశారు? దర్యాప్తు ఏ దశలో ఉంది ఎంతమందిని ప్రశ్నించారు అని అడగాల్సి వచ్చింది. పోలీసుల దగ్గర ఈ ప్రశ్నలకు సమాధానమే లేదు. రెండువారాలలోగా దర్యాప్తు అధికారి మా ప్రశ్నలకు జవాబు చెప్పాలి అని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిజానికి 2018లోనే సుప్రీంకోర్టు విద్వేషప్రచారంపై తహసీం పూనావాలా కేసులో మార్గదర్శకాలు జారీచేసింది. అంతకన్నా ముందే 2014లోనూ విద్వేష ప్రసంగాలను ఆషామాషీ వ్యవహారంగా చూడకూడదని చెప్పింది. విద్వేష ప్రసంగాలు చివరకు మానవ హననానికి దారి తీస్తాయి. అధికారంలో ఉన్నవారి దన్ను లేకపోతే ఏ పోలీసు అధికారీ సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించకుండా ఉండడం సాధ్యం కాదు.

న్యాయమూర్తులు కె.ఎం.జోసెఫ్, నాగరత్న విచారించిన కేసులోనైతే అసలు ఈ విషయంలో ప్రభుత్వ జోక్యమే ఉండకూడదు. కానీ పోలీసులు ఏ మాత్రం ఖాతరు చేయనందువల్ల ప్రభుత్వం కూడా ఇందులో భాగస్వామి కావలసి వచ్చిందని ఈ న్యాయమూర్తులు అన్నారు. ప్రధాన న్యాయమూర్తి విచారించిన కేసు కోర్టు ధిక్కారానికి సంబంధించింది. మహాత్మాగాంధీ మనవడు తుషార్‌గాంధీ ఈ కేసు దాఖలు చేశారు. న్యాయమూర్తి జోసెఫ్ నాయకత్వంలోని బెంచి ముందు ధర్మసన్సద్‌ల వ్యవహారం విచారణకు వచ్చింది. విద్వేష వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ఎంత తీవ్రంగా పట్టించుకుందో ప్రభుత్వం అంతకన్నా ఎక్కువ అలసత్వం ప్రదర్శిస్తోంది. అయితే అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి సందర్భాలలో నిర్దిష్టమైనచర్య తీసుకోకుండా కార్యనిర్వాహక వర్గాన్ని అభ్యర్థిస్తున్న రీతిలో మాట్లాడడం కూడా ఓ వైపరీత్యమే. నిర్లక్ష్యం చేసిన అధికారులపై కోర్టు ధిక్కార కేసు మోపవలసింది. కానీ అలా జరగలేదు.

నిజానికి విద్వేష ప్రసంగాలవంటి విషయంలో పోలీసులు ఎవరో ఫిర్యాదు చేసే దాకా ఆగనక్కర్లేదు. నేరుగా కేసు నమోదు చేయవచ్చు. అలా చేయకపోగా అత్యున్నత న్యాయస్థానం ఆదేశం పాటించకపోవడం చాలా ప్రమాదకరం. 2020లో ఉత్తరాదిలో మతకలహాలు పెచ్చరిల్లిన దశలోనే భారత శిక్షాస్మృతిలో సెక్షన్ 295ఎ ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. అయినా పోలీసులు చట్టం ప్రకారం తమ బాధ్యతలు నిర్వహించడానికి వెనుకాడుతున్నారంటే ఏ ప్రభుత్వానికీ పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించడం ఇష్టంలేదు. అసలు సమస్య విద్వేషం అంటే ఏమిటి అని నిర్ణయించడంలోనే ఉంది. ఇక్కడ మతాన్ని దృష్టిలో ఉంచుకునే వ్యవహరిస్తుండడం దారుణం. జంతర్ మంతర్‌లో కొద్ది కాలం కిందట పోలీసుల సమక్షంలోనే విద్వేషం రెచ్చగొట్టే సాహసం ప్రభుత్వ దన్ను లేకుండా జరిగిందికాదు. ఇదంతా పోలీసులు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉన్నారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పోలీసుల మద్దతు తమకు ఉందన్న భరోసా హిందుత్వ వాదులకు ఉండడంలో ఆశ్చర్యం ఏముంటుంది? విద్వేషాన్ని రెచ్చగొట్టే వారికి, పోలీసులకు మధ్య ఒక విధమైన ఏకాభిప్రాయం ఉన్నట్టు అడుగడుగునా రుజువవుతోంది. ఇప్పుడు మరింత నగ్నంగా చెలరేగిపోతోంది. వెయ్యేళ్ల నుంచి హిందూ సమాజం ఇతర మతాలవారితో యుద్ధం కొనసాగిస్తోందనీ దీనికి స్పందనా తీవ్రంగానే ఉంటుందని ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ అన్న మాటల వెనక అంతరార్థమే పోలీసుల నిర్లక్ష్యానికి కారణం అనడానికి గొప్ప పాండిత్యం అవసరంలేదు. పోలీసులే సుప్రీంకోర్టు మాట పట్టించుకోనప్పుడు టీవీ ఆంకర్ల మీద సుప్రీంకోర్టు ఆగ్రహం ప్రదర్శిస్తే ప్రయోజనం ఉంటుందని అనుకోలేం. టీవీ ఆంకర్లలో అనేకమంది గోదీ మీడియాలో భాగమన్నది బహిరంగ రహస్యమేగా! వాక్‌స్వాతంత్ర్యాన్ని, భావప్రకటనా స్వేచ్ఛను బాహాటంగా ఉల్లంఘించేవారు ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నవారే. ఇంత జరుగుతున్నా మెతక వైఖరి అనుసరించే అత్యున్నత న్యాయస్థానం హిత బోధలు నిష్ప్రయోజనంగానే మిగిలిపోతాయి.

పతనం దిశగా పాక్

ఆసియా ఖండంలో గత ఏడాది అన్ని రంగాల్లో వెనుకబాట పట్టిన దేశంగా శ్రీలంక చరిత్ర పుటల్లో చేరింది. ప్రస్తుతం రాజకీయ సంక్షోభం నుంచి బయటపడినా, ఆర్థికపరిస్థితి మాత్రం కుదేలైంది. తాజాగా మన పొరుగు దేశమైన పాకిస్థాన్ ఈ జాబితాలో చేరనుందా అనే సూచన కనపడుతోంది. పాక్ గత సంవత్సరంలో ఎన్నడూ లేనంతగా వరదలు చవిచూసింది. ఆర్థికంగా అపారనష్టంతో కూనరిల్లింది. మనలాంటి దేశం చేసే సహాయాన్ని కూడా చేజేతులా జారవిడుచుకుంది. ఇమ్రాన్‌ఖాన్ నాయకత్వం వద్దు అని, ప్రస్తుతం షాబాజ్ షరీఫ్ నాయకత్వంలో దేశం నడుస్తున్న వేళ, గతంలో ఎన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం, అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. పొరుగు దేశాలతో ముఖ్యంగా అఫ్గానిస్తాన్‌తో వైరం ముదురుతోంది. మన దేశంతో దూరంగా ఉండే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతర్జాతీయంగా ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చే పరిస్థితి తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు చెబుతున్నా ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులను పూర్తిగా నియంత్రించలేక పోతోంది. తాజాగా మన దేశ సరిహద్దుల్లో చొరబాట్లు, ఉగ్రవాదులు తరచూ అక్రమంగా ప్రవేశిస్తున్నారు. డ్రోన్స్ ద్వారా తరచూ దాడులకు పాల్పడుతున్నారు. ఇటువంటి పరిస్థితులను ప్రస్తుత పాక్ పాలకులు నియంత్రించాలి. వర్తక వాణిజ్యం, పర్యావరణ కాలుష్యం, అధిక ఋణాలు వెంటాడుతూనే ఉన్నాయి.

పాక్‌లో ఉన్న ప్రస్తుత పరిస్థితులపై ఆ దేశ ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నట్లు వివిధ మాధ్యమాలు ప్రచారం చేస్తున్నాయి. దీనిలో భాగంగా ప్రజలు వలసబాట పడుతున్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో ప్రజలు జీవితాలు దుర్భరం అవుతున్నాయి. విద్య, వైద్యానికి ప్రభుత్వం వద్ద తగిన నిధులులేవు. విదేశీమారక ద్రవ్యనిల్వలు అట్టడుగు స్థాయికి చేరుకున్నాయి. దీంతో భవిష్యత్తులో పాక్ మరో శ్రీలంకగా మారే అవకాశం కనపడుతుంది. రాజకీయ, ఆర్థిక అస్థిరతల మధ్య దేశం గత కొన్ని సంవత్సరాలుగా కొట్టుమిట్టాడుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాల పూర్తయినా ఎక్కువ కాలం పాక్ సైనిక పాలనలోఉంది. ఉగ్రవాదం రాజ్యమేలుతోంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ దేశాలు నిధులు మంజూరుకు ముందుకు రాకపోవడం, పర్యాటకం క్షీణించడం, పారిశ్రామిక, వ్యవసాయరంగాలు అభివృద్ధి చెందకపోవడం, మహిళలపై ఆంక్షలు, వెనుకబాటుతనం వంటి అంశాలు పాక్‌ను వెంటాడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశంలో రాజకీయ సుస్థిరత లేకపోవడమే.

ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ అనేక రంగాల్లో అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉంది. పని లేక, తిండి లేని స్థితిలో పాక్ ప్రజలు తల్లడిల్లుతున్నారు. పొరుగు దేశాలకు వలసలు వెళుతున్నారు. కొందరైతే తమ సొంత ఇళ్లను, ఆస్తులను సైతం అమ్ముకుని, శాశ్వతంగా ఇతర దేశాలకు వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. దీనిని బట్టి పాక్ భవిష్యత్ అంధకారంలో ఉండేటట్లు కనపడుతుంది. ఇకనైనా పాలకులు ఉగ్రవాదానికి సహకరిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని. ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా మూడు పూటలా తిండి దొరికే పరిస్థితి కల్పించాలి. రాజకీయ సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే "డార్క్ వెబ్" పాక్‌ను వెంటాడుతున్న మరో సమస్య. గత పాలకులు అనేక మంది అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పారదర్శకంగా, నిజాయితీ పాలనకు పెద్ద పీట వేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి. సమస్యలకు పరిష్కారం శాంతియుత చర్చలే మార్గం అని గ్రహించాలి. ఇరుగు పొరుగు దేశాలతో మంచి సంబంధాలు కలిగి ఉండేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. "చెప్పేది ఒకటి, చేసేది మరొకటి" అనే విధానానికి స్వస్తి చెప్పాలి.

ప్రసాదరావు, సెల్: 6305682733

జీడీపీపై మోదీ మౌనమేల!

సత్య

దేశ జీడీపీని 2024 మార్చి నాటికి (లోకసభ ఎన్నికలతరుణం) ఐదులక్షలకోట్ల డాలర్లకు పెంచాలని 2019లో ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఐదు సంవత్సరాల పాటు దాన్నే ఊరిస్తూ జనంలో చర్చ జరగాలన్న దూరాలోచన దాని వెనుక ఉంది. అనుకోని పరిణామాలు ఎదురు కావటంతో మిగతా కబుర్ల మాదిరే ఇప్పుడు మోదీ కూడా దీని గురించి కూడా మాట్లాడటం లేదు. కొత్త " కతలు " తప్ప ఒకసారి చెప్పినదానిని మరోసారి చెప్పి బోరు కొట్టించే అలవాటు లేదు కదా ! ఆ తరువాత మోదీ మౌనం, ఆర్థిక సలహాదారులు 2027కి సాధిస్తాం అన్నారు, ఐఎంఎఫ్ 2029 అని చెప్పి కాదు కాదు లెక్క తప్పింది 2027కే అని చెప్పింది. పొలిటీషియన్ అన్నతరువాత ఒపీనియన్స్ మారుస్తుండాలని గిరీశం చెప్పినట్లుగానే ఆ సంస్థ కూడా పరిస్థితిని బట్టి మా అంచనా తప్పిందంటూ మరోసారి మార్చదని చెప్పలేము. రానున్న ఐదు సంవత్సరాల్లో స్థిరంగా ఏటా తొమ్మిది శాతం వృద్ధి సాధిస్తే 2028-29 నాటికి ఐదులక్షల డాలర్లను సాధిస్తామని రిజర్వుబాంకు మాజీ గవర్నర్ డి సుబ్బారావు చెప్పినట్లు 2022 ఆగస్టు పదిహేనవ తేదీ పత్రికలు ప్రకటించాయి. తాజాగా ఐదు లక్షల డాలర్ల గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఆ పాత పాట పాడితే బోరు కొడుతుంది కనుక కొత్త పల్లవి అందుకున్నారు.

ఈ మధ్య దేశ జీడీపీ గురించి కొత్త గీతాలు వినిపిస్తున్నారు. పది లక్షల డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా పెరుగుతున్న భారత్ అంటూ సిఇబిఆర్ అనే సంస్థ తాజాగా ఒక విశ్లేషణ చేసింది. దాని ప్రకారం 2035 నాటికి పది లక్షల డాలర్లకు చేరుతుందని చెప్పింది. ఒక లక్షకోట్లడాలర్లకు చేరేందుకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆరు దశాబ్దాలు పడితే తదుపరి ఒక లక్ష డాలర్లను జత చేసేందుకు ఏడుసంవత్సరాలు, ఆ తరువాత మూడవ లక్షకు ఐదు సంవత్సరాలు (2019) పట్టిందని, ప్రస్తుతం 3.1లక్షల కోట్ల డాలర్లుగా ఉందని పేర్కొన్నది. ప్రస్తుత వేగాన్ని చూస్తే రానున్న 14-15 సంవత్సరాల్లో ప్రతి రెండేళ్లకు ఒక లక్ష కోట్ల డాలర్ల వంతున జీడీపీ పెరుగుతుందని అంచనా వేసింది.

తెలుగునాట అంత్య కంటే ఆది నిష్ఠూరమే మేలని భావించేవారు ఏదైనా చెప్పే ముందు అంటే అన్నారని తెగ గింజుకుంటారు గానీ అని ప్రారంభిస్తారు. పట్టణాల్లో పదిశాతం, దేశ సగటు 8.3శాతం నిరుద్యోగం ఉందని, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నవారి సంఖ్య 2022 డిసెంబరులో 40.48 శాతం పెరిగిందని సిఎంఐఇ పేర్కొన్నది. దేశ జీడీపీ ఎంత పెరిగింది, ఎన్ని పెట్టుబడులను ఆకర్షించారు అన్నది ఒక అంశమైతే దాని వలన జనాలకు ఒరిగిందేమిటి అన్నది ప్రశ్న. సంపద పెరిగి కొందరి చేతుల్లో పోగుపడితే ఫలితం ఉండదు. కేంద్ర ప్రభుత్వం ఉత్పాదకతతో ముడిపడిన ప్రోత్సాహకాల (పిఎల్ఐ) పథకాన్ని అమలు జరుపుతున్నది. కరోనా కాలంలో ఫార్మా రంగంలోకి పెట్టుబడులు వచ్చినా ఉపాధి పెరగలేదు. లక్ష్యాన్ని మించి 107 శాతం పెట్టుబడులు వచ్చినా ఉపాధి పెరిగింది 13 శాతమే. ఇక మన దేశం నుంచి సెల్‌ఫోన్ల ఎగుమతులు పెద్దగా పెరిగినట్లు అది తమ ఘనతగా చెప్పు కుంటున్న చోట అనుకున్నదానిలో వచ్చిన పెట్టుబడి 38 శాతం కాగా ఉపాధి పెరిగింది కేవలం నాలుగు శాతమే. ఎలక్ట్రానిక్స్‌లో వచ్చిన పెట్టుబడులు 4.89 శాతం కాగా పెరిగిన ఉపాధి0.39శాతమే. (ఇండియా కేబుల్ విశ్లేషణ 2022 నవంబరు 14) అందుకే పెట్టుబడులు వచ్చి ఉపాధి రహితవృద్ధి జరిగితే జీడీపీ పెరిగినా జనానికి వచ్చేదేమీ ఉండదు.

అందుకే ఈ అంశాల గురించి జుమ్లా కబుర్లు చెబితే జనంనమ్మరు గనుక బిజెపినేతలు కొత్త కబుర్లు చెబుతున్నారు. నిరుద్యోగం, ఉపాధి లేమి గురించి కొత్తరికార్డులు నమోదౌతున్నా, వీటినిగురించి పట్టించు కోకుండా ఇతర అంశాల గురించి మాట్లాడేవారిని ఏమనాలి? 2024 జనవరి ఒకటి నాటికి అయోధ్య రామాలయ నిర్మాణం సిద్ధం అవుతుందని ఆ రోజునే దర్శనం చేసుకొనేందుకు ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా చెబుతారు. గతంలో కాశీని చూసేందుకు ఏడాదికి కోటి మంది వచ్చే వారని, కాశీ విశ్వనాథ్ ధామ్ అభివృద్ధి తరువాత ఒక్క గత శ్రావణమాసంలోనే కోటి మంది వచ్చారని, అదే మాదిరి అయోధ్య రామాలయ నిర్మాణం పూర్తైన తరువాత పది రెట్లు పెరుగుతారని, ఆధ్యాత్మిక టూరిజాన్ని వృద్ధి చేస్తామని ఉత్తరప్రదేశ్ సిఎం ఆదిత్యనాథ్ ఊరిస్తున్నారు. లక్షల కొలది ఉద్యోగాలను సృష్టిస్తామని, అందుకుగాను ఫలానా పథకాలు ఫలానా తేదీలోగా ఉనికిలోకి వస్తాయని చెప్పాల్సిన వారు పూజలు పునస్కారాలు, దేవుళ్ల సందర్శనకు వసతులు కల్పిస్తామంటున్నారు. రోడ్లు, మురుగు కాలవల వంటి అల్ప అంశాలను వదలి లవ్ జీహాద్ మీద కేంద్రీకరించాలని కర్ణాటకలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నళిన్ కుమార్ నిరంజన్ సెలవిస్తారు. ఏ విత్తనం వేస్తే ఆ చెట్టుకు అవే పండ్లు కాస్తాయి. వీరంతా దేశాన్ని ఎక్కడికి తీసుకుపోదలచుకున్నారు. గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన గుజరాత్ తరహా అభివృద్ధి, నల్లధనం వెలికితీత, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, అచ్ఛే దిన్ కబుర్లు ఎక్కడా వినిపించటం లేదిప్పుడు, ఎందుకంటారు ? ఆధ్యాత్మిక టూరిజం గురించి ఒక వైపు కబుర్లు చెబుతూ మరోవైపు ఝార్కండ్ ప్రభుత్వం తలపెట్టిన ఆధ్యాత్మిక టూరిజాన్ని సంఘపరివార్ శక్తులు వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే అక్కడ బీజేపీ సర్కార్ లేదు. ఇరవై నాలుగుమంది జైన తీర్థంకరులలో ఒకరైన(23వ) పార్శ్వనాథ్ గిర్డ్ జిల్లాలోని షిఖర్జీ పర్వతంపై మోక్షం పొందినట్లు చెబుతారు. జైనులకు అదొక పుణ్యస్థలం. ఆ ప్రాంతంలో టూరిజం వద్దని జైనులు ఆందోళన చేస్తున్నారు. ఆధ్యాత్మిక టూరిజాన్ని 2019 లో ప్రకటించిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు పూర్తి భిన్న వైఖరి తీసుకొని తప్పు జార్ఖండ్‌రాష్ట్రం మీద నెట్టివేసేందుకు పూనుకుంది.

రానున్న ఏడు సంవత్సరాల్లో 7లక్షల కోట్లకు చేరనున్న జీడీపీ అంటూ మరొక వార్త. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారువి అనంత నాగేశ్వరన్ చెప్పిన అంశాల ఆధారంగా వచ్చింది. 2023 మార్చి ఆఖరుకు మన జీడీపీ 3.5లక్షల డాలర్లు ఉంటుందని, వచ్చే ఏడు సంవత్సరాల్లో ఏడు లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని, ఇది అసాధ్యం కాదని మర్చంట్స్ ఛాంబర్ (ఎంసిసిఐ) సమావేశంలో నాగేశ్వరన్ చెప్పారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతున్నది. అందువలన ఎంత పెరిగితే ఏమి లాభం ! దేశంలోని పది మంది ధనికుల చేతుల్లో దేశ జీడీపీలో 11 శాతం విలువగల సంపద ఉంది. ఫిన్‌బోల్డ్ అనే సంస్థ సేకరించి విశ్లేషించిన సమాచారం ప్రకారం 2022 డిసెంబరు నాటికి పది మంది సంపద 387 బిలియన్ డాలర్లు లేదా రు.31.64లక్షల కోట్లు. దేశ జీడీపీ అక్టోబరు నాటికి 3.47 లక్షల కోట్ల డాలర్లని ఐఎంఎఫ్ అంచనా వేసింది, దీనిలో 11.16 శాతం పది మంది చేతిలో ఉంది. తొలి ఐదు స్థానాల్లో ఉన్నవారి వివరాలు దిగువన చూడవచ్చు.

ధనికుడి పేరు ××××	సంపద బి.దాలర్లు
గౌతమ్ అదానీ ×××	132.79
ముఖేష్ అంబానీ ××	96.5
సైరస్ పూనావాలా××	24.88
శివ నాదార్ ×××××	22.58
దమాని(డి మార్ట్) ××	21.25

సంపదలు ఇలా కొద్ది మంది వద్ద పోగుపడుతూ ఉంటే దేశ ఆర్థిక, సామాజిక వృద్ధి కుంటుపడుతుందని, అనేక అనర్ధాలకు దారితీస్తుందని అనేక మంది హెచ్చరిస్తున్నాసంపదలు పోగుపడటాన్ని మనపాలకులు అనుమతి స్తున్నారు. ఆర్థిక వృద్ధిరేటు పెరిగితే సంపదల అంతరం తగ్గుతుందని చెబు తున్నారు. అలాంటి సూచనలు ఎక్కడా కనిపించటం లేదు. సంపదలు ఇలా పెరగటానికి పలుఅంశాలు దోహదం చేస్తున్నాయి. సంపద పెరిగిన కొద్దీ పన్నులు పెంచాల్సి ఉండగా తగ్గించటం వాటిలో ఒకటి. ఉపాధి లేకపోవటం, ఉన్నవారికికూడా వేతనాలు తక్కువగాఉండటం, సామాజిక భద్రత లేకపోవటం, విద్య, వైద్యం వంటి సేవలను ప్రైవేటీకరించటం వంటి అంశాలన్నీ సంపదల అసమానతలను పెంచుతున్నాయి. వాటిని తగ్గించేందుకు చేసిందేమీ లేదు.

మకర జ్యోతి-మనిషి మహాత్యం

డాక్టర్ దేవరాజు మహారాజు

శబరిమలను హిందువులు పుణ్యక్షేత్రంగా భావిస్తారు. అది పెరియార్ టైగర్ రిజర్వు ప్రాంతంలో పశ్చిమ కనుమల కొండల్లో ఉంది. చుట్టూ ఉన్న 18 కొండల మధ్య, దట్టమైన అడవుల్లో ఒక కొండ మీద అయ్యప్ప గుడి ఉంది. సముద్ర మట్టానికి 4,133 అడుగుల ఎత్తులో-పతనం తిట్ట జిల్లాలో, పెరునద్ గ్రామ పంచాయితి పరిధిలో ఉంది. ప్రతి ఏటా ఈ దేవాలయాన్ని 45-50 మిలియన్ల భక్తులు దర్శించుకుంటున్నారు. అయ్యప్పను సస్త అనీ, ధర్మసస్త అనీ కూడా పిలుచుకుంటారు. పన్నెండో శతాబ్దంలో పండలం రాజవంశీకుడు, యువరాజు మణికందన్ శబరిమలలో తపస్సు చేశాడని, ఆయన అయ్యప్ప అవతారమనే భక్తులు భావిస్తారు. పండలం రాజవంశీకుల కాలం (1821) నాటికే ఈ గుడి అతి పురాతనమైందని చెపుతారు ఇప్పుడున్న అయ్యప్ప విగ్రహం 1910 లో ప్రతిష్టాపించారు. కేరళ శబరిమలలో ప్రతి సంవత్సరం మకరవిలక్కు- అనే పండుగ జరుగుతుంది. ఇందులో 1.తిరువాభరణం 2. మకరజ్యోతి అనే రెండు ముఖ్యమైన కార్యక్రమాలుంటాయి. తిరువాభరణం అంటే అయ్యప్పస్వామి ఆభరణాల్ని ఊరేగించడం. రెండోది మకరజ్యోతి దర్శనం, వీటిని చూడడానికే భక్తులు అక్కడికి చేరుకుంటారు.

రామాయణ కావ్యంలో కథా నాయకుడు శ్రీ రాముడు. ఆయన తమ్ముడు లక్ష్మణుడు అదివాసి భక్తురాలైన శబరిని ఆ ప్రాంతంలో కలుసుకున్నందువల్ల దానికి శబరిమల అనే పేరువచ్చిందని స్థల పురాణం ఉంది. అక్కడ శబరి పండ్లు మంచివా కావా అని ఒక్కొక్కటీ రుచి చూసి, మంచి పండ్లు ఏరి రామునికి సమర్పించుకుందని కూడా స్థల విశేషాల్లో ఉంది. కొద్ది దూరంలో తపస్సు చేసుకుంటున్నది ఎవరిని రాముడు శబరిని అడిగితే అతను సస్త అని చెపుతుంది. రాముడు సస్త దగ్గరికి వెళతాడు. సస్త లేచి నిలబడి రాముడికి స్వాగతం పలుకుతాడు. ఆ సస్త ఎవరో కాదు. అయ్యప్పే అని తెలుస్తుంది. అక్కడి పూజింపబడుతున్న అయ్యప్పకు హరిహర పుత్ర అనే మరో పేరు ఉంది. అంటే ఈయన హరికి-హరుడికి కలిగిన సంతానం. మహావిష్ణు-శంకరుల సంతానమన్నమాట. మన హిందూ దేవుళ్లకున్న మహిమల్లో ఇదొకటి. ఇద్దరు మగవాళ్లకు అయ్యకు-అప్పకు పుట్టడమేమిటని అమాయకంగా ఎవరూ అడగొద్దు. కల్పించుకున్న దైవ మహిమలు ఎలాగైనాఉంటాయి. అసంబద్ధమైన అంశాల్నే మన భక్తులు భక్తి పారవశ్యంతో పూజిస్తుంటారు. హేతుబద్ధతకోసం అంగలార్చేవారికి అదొక సమస్య. కానీ.. కళ్లు మూసుకుని విశ్వసించేవారికి అది సమస్యేకాదు. హిందువులు ఏర్పరచుకున్న రాశులలో మకరరాశి ఒకటి. మకర జ్యోతి అంటే మకరరాశి వెలుగు. అయ్యప్ప 'మకరజ్యోతి'గా మారి ప్రతి సంవత్సరం 14 జనవరినాడు భక్తులకు ఒక నక్షత్రంగా (వెలుగుగా) కనిపించి దీవిస్తాడని స్థలపురాణం(ఒక విశ్వాసం) ఉంది. ఉత్తరాయంలో సూర్యుడు ఉత్తర దిశగా ఆరునెలలపాటు ప్రయాణిస్తాడని, మకర సంక్రాంతి (14 జనవరి) రోజు ప్రారంభమైన ప్రయాణం కర్కసంక్రాంతి (14జులై) రోజున ముగుస్తుందనీ చెపుతారు. సంక్రాంతికి పంటలు ఇళ్ళకు రావడం-గ్రామాలన్నీ సంతోషంతో కళకళలాడడం జరుగుతుంది. మనిషి ప్రకృతితో అనుసంధానమైన పండగ ఇది అని అనుకుంటే చాలా గొప్పగా అనిపిస్తుంది. మళ్లీ రాముడు, శబరి, అయ్యప్ప అంటే మాత్రం కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మకరజ్యోతి వేరు. మకర విలక్కు అనేది వేరు. మకర జ్యోతి భక్తుల విశ్వాసం. మకరవిలక్కు అనేది కేవలం మనిషి వెలిగించే అఖండ దీపం. దాన్నే ఇప్పుడు భక్తులు 'మకరజ్యోతి'గా పరిగణిస్తున్నారు.

శబరిమలలో అయ్యప్ప దేవాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో పొన్నాంబలం కొండ మీద గతంలో మల ఆర్య అనే గిరిజన జాతివారు పూజచేసి, పెద్ద దీపం వెలిగించేవారు. దాన్నే 'మకర విలక్కు' అని అనేవారు. పొన్నాబలం కొండమీద కూడా ఒక చిన్న గుడి ఉంది. అక్కడి గిరిజనులు ఆ గుడిలోని దేవతా మూర్తికి హారతి ఇచ్చేవారు. కర్పూరం, నెయ్యి వంటి వాటితో పెద్ద దీపం వెలిగించి, అక్కడున్న విగ్రహం చుట్టూ మూడుసార్లు తిప్పి హారతి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ కొండ మీది దేవాలయంవైపు ఎవరినీ పోనివ్వడం లేదు. ఆది అటవీశాఖ వారి ఆధీనంలోఉంది. అటవీశాఖ, పోలీసుశాఖ, శబరిమల అయ్యప్ప దేవాలయ సిబ్బంది కలిసికట్టుగా, గుట్టుగా నిర్వహిస్తున్న కార్యక్రమమే-మకర విలక్కు. వీరు వెలిగించే అఖండ దీపమే మకరజ్యోతి. అంటే కొండమీద నక్షత్రమనే ఒకప్పటి భ్రమే, ఇప్పుడు వాస్తవంగా మారింది! కేరళ (ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవోసం(దేవాలయ) బోర్డు, అటవీశాఖల సహకారంతో ఆ కార్యక్రమం నిర్వహిస్తోందని కేరళ హైకోర్టు ధృవీకరించింది. వాస్తవాలన్నీ బహిర్గతమయ్యాయి. గనక, ఇంకా ఈ విషయంమ్మీద పరిశీలనలు అవసరంలేదని కూడా కోర్టు చెప్పింది.

ఒకప్పటి అమాయక గిరిజన సంప్రదాయాన్ని నేటి నాగరిక మూఢ భక్తాగ్రేసరులు కొనసాగిస్తున్నారు. దానికి ప్రభుత్వం యంత్రాంగాలన్నీ తమ శాయశక్తులా సహకరిస్తున్నాయి. మూఢభక్తి, ఒక ఆచారం చాదస్తం కొనసాగ డానికి ఎక్కువ సంఖ్యలో ఉన్న విశ్వాసకులే కారణం కాదు. రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలన్నీ కారణమేనని చెప్పడానికి ఇదిచక్కటి ఉదాహరణ. భద్రాద్రికి వెళ్లే ముత్యాల తలంబ్రాలే కావొచ్చు. సమ్మక్క సారక్క జాతరే కావచ్చు. ఇంకా



అలాంటి ఏ ఇతర సాంప్రదాయాలైనా కావొచ్చు. అన్నిటికీ సూత్రమొక్కటే! ఏ ప్రాంతంలోనైనా, సూత్రధారులు ఒకేరకంగా వ్యవహరిస్తారనేది మనం తెలుసుకోవాలి!! 14 జనవరి, ఉదయం పొన్నాంబలం(యిడు) కొండకు ఒక బృందం బయలుదేరి సాయంత్రానికి అక్కడికి చేరుకుంటుంది. మధ్యలో మధ్యాహ్నం కాసేపు సేదదీరి, భోజనాలు చేసి, మళ్లీ ప్రయాణమవుతారు. ఆ బృందంలో 50మంది అటవీ శాఖవారు, 50 మంది పోలీసులు, విద్యుత్ శాఖవారు 10మంది, అయ్యప్ప ఆలయ సిబ్బంది మరో 10మంది, సామాన్లు మోయడానికి కూలీలు వగైరా అంతా కలిసి ఒక బృందంగా వెళతారు. సాయంత్రానికి కొండమీదికి చేరిన ఆ బృందం సంధ్యవేళ 6గం-16 నిమిషాల నుంచి 6గంటల 20నిమిషాల వరకు అఖండ జ్యోతి వెలిగిస్తారు. సుమారు పదికిలోల కర్పూరం వెలిగించేసరికి పెద్దజ్యోతి పైకిలేస్తుంది. ఆ వెలుగుకు అడ్డంగా కొందరు లావుపాటి దుప్పటి మూడుసార్లు అడ్డుపెట్టి తొలగిస్తారు. దాంతో శబరిమల ఆలయంలో ఉన్న భక్తులకు, ఇంకా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నవారికి ఆకాశంలో నక్షత్రం మూడుసార్లు మినుకు మినుకుమని వెలిగి మాయమైందన్న భ్రమ కలుగుతుంది. అదే మనిషిచేసే మకరజ్యోతి మహత్యం!

ఈ కార్యక్రమాన్ని సన్నిధానం (అయ్యప్ప గుడి ఆవరణ) నుండి, పండిత వలం, పుల్‌మేడు, కొండపై నుండి చలకయం, అట్టతోడు, సరంకుతి, నీలిమల, మరకుటమ్, వంటి నిర్ణీత స్థలాల నుండి భక్తులు మకరజ్యోతిని దర్శించుకుంటూ ఉంటారు. పొన్నాంబలం(యిడు) కొండ మీద హారతి కార్యక్రమం అయిపోగానే, కొండ కింద అయ్యప్ప గుడిగోపురం నుంచి అర్చకులు భక్తులకు సంకేతాలిస్తారు. దాంతో కార్యక్రమం ముగిసిందని భక్తులు తెలుసుకుని, ఎవరిదారిన వారు వెళ్లిపోతారు. అయ్యప్ప దర్శనానికి సంబంధించి మహిళల విషయ మొకటి కోర్టు కెక్కింది. 1991లో కేరళ హై కోర్టు 10-50 సంవత్సరాల మధ్య గల బాలికలు, మహిళల ప్రవేశాన్ని నిషేధించింది. ఆ వయసులో వారు రుతుక్రమంలో ఉంటారని, వారి ప్రవేశం వల్ల ఆలయం అపవిత్రమైపోతుందన్న కారణంతో కోర్టు ఆ ఉత్తర్వునిచ్చింది. (అదీగాక, అయ్యప్పకు తల్లిలేదు. ఆయన అయ్యకు, అప్పకు పుట్టినవాడు కదా? స్త్రీలు అపవిత్రులైతే, పుట్టుకే అపవిత్రం. మనుషులంతా అపవిత్రులే. మరి దానికేమంటారు? ఈ విషయం అక్టోబరు 2017లో రాజ్యాంగ బెంచ్‌కి వెళ్లింది.

పొన్నాంబలం కొండమీద 1950 కంటే ముందు ఆదిమ తెగలు నివసిస్తూ ఉండేవి. సంక్రాంతి రోజున దేవుడికి పెద్దదీపం వెలిగించి పూజలు చేసుకోవడం ఆనాటి గిరిజన సంప్రదాయం. అది ఆకాశంలో నక్షత్రమని చుట్టుపక్కల ప్రాంతాల్లోని వారు అనుకుంటూ ఉండేవారు. హైడల్ ప్రాజెక్ట్ కట్టడంతో ఆ కొండ ప్రాంతంవారు నిర్వాసితులయ్యారు. మూడు, నాలుగేళ్లపాటు అక్కడ ఎవరూ దీపం వెలిగించలేదు. ఎవరికీ ఏ నక్షత్రమూ కనిపించలేదు. ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని అలాగే నిలపడానికి కేరళ ప్రభుత్వమే మకరజ్యోతి వెలిగించడం ప్రారంభించింది. 1983,84 సంవత్సరాల్లో కేరళ రాష్ట్ర హేతువాద, మానవవాద సమాఖ్య (ఫారా) పూనుకొని, పొన్నాంబలం కొండపైకెక్కి రాకెట్లు, బాణాసంచా పేల్చారు. ఆ రోజుల్లో దూరదర్శన్ ప్రేక్షకులు ఆ దృశ్యాలు చూశారు. ఈ రచయిత కూడా ఆ ప్రేక్షకుల్లో ఒకరు. ఈ విషయాల్లో ఇతరులు జోక్యం చేసుకుంటే మకరజ్యోతి మాయ బట్టబయలవు తుందని ఇప్పుడు ఎవరినీ ఆ కొండపైకి వెళ్లనివ్వరు. మకరజ్యోతిపై నమ్మకం సడలితే భక్తులు తగ్గుతారు. శబరిమల కేంద్రంగా సాగుతూ వస్తున్న అనేక వ్యాపారాలు దెబ్బతింటాయి. ఏ ప్రభుత్వ లక్ష్యమైనా ప్రజల్ని తమ గుప్పిట్లో ఉంచుకోవడమే కదా? అప్రయత్నంగా వస్తున్న రాబడిని ఎవరైనా ఎందుకు వదులుకుంటారూ?

-సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

మూత్ర విసర్జన ఘటన

శంకర్ ఆరోపణలు అబద్ధం: బాధిత మహిళ

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలోని బిజినెస్ క్లాస్‌లో ప్రయాణిస్తున్న ఓ మహిళపై తాగిన మత్తులో శంకర్ మిశ్రా అనే వ్యక్తి మూత్ర విసర్జన చేసిన ఘటనకు సంబంధించిన కేసు కొత్త మలుపు తిరిగింది. విమానంలో ప్రయాణిస్తున్న వృద్ధ మహిళాపై తాను మూత్ర విసర్జన చేయలేదని, ఆమెనే మూత్రం పోసుకున్నట్లు శంకర్ మిశ్రా ఢిల్లీ కోర్టులో శుక్రవారం చెప్పాడు. అయితే అతని ఆరోపణలను బాధిత మహిళ శనివారం తీవ్రంగా ఖండించారు. అతను చెప్పేవన్నీ అబద్ధాలేనని స్పష్టంచేశారు. 'నిందితుడు చేస్తున్న ఆరోపణలు నిజం కాదు. అవి పూర్తిగా అవాస్తవం. అతను కావాలనే అలా చెబుతున్నాడు. శంకర్ మిశ్రా తన బెయిల్ దరఖాస్తులో పేర్కొన్న విషయాలు, కోర్టులో చేసిన వ్యాఖ్యలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నేను అనుభవించిన ఇలాంటి భయానక పరిస్థితి మరెవరూ ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో నేను ఫిర్యాదు చేశా' అని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా...నవంబర్ 26న న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెన్నెడీ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో ఓ తాగుబోతు తన సీటు వద్దకు వచ్చి మూత్ర విసర్జన చేసినట్లు ఎయిర్ ఇండియా చైర్మన్‌కు రాసిన లేఖలో ఆరోపించిన విషయం తెలిసిందే. బట్టలు, బ్యాగులు, బూట్లు పూర్తిగా మూత్రంతో తడిసిపోయాయని మహిళ ఆరోపించారు. ఈ విషయాన్ని సిబ్బంది దృష్టికి తీసుకెళితే ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన తర్వాత వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. ఘటనపై దర్యాప్తు కోసం అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది.

సిసోడియా ఇల్లు, ఆఫీసులో సీబీఐ తనిఖీలు

సోదా జరగలేదు...
రికార్డుల కోసమే వెళ్లాం: దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇల్లు, కార్యాలయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తనిఖీలు నిర్వహించింది. ఢిల్లీ ఎక్సైజ్ విధానం కేసులో సంబంధిత రికార్డులు తీసుకునేందుకు వెళ్లినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. సిసోడియా కార్యాలయం, ఇల్లో సీబీఐ సోదాలు జరిగాయని ఢిల్లీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించగా కేవలం రికార్డుల కోసమే వెళ్లామని, తనిఖీలు నిర్వహించలేదని దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. అయితే సీబీఐ తనిఖీల గురించి సిసోడియా ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఏ తప్పు చేయని తనకు వ్యతిరేకంగా సీబీఐ అధికారులకు ఎలాంటి ఆధారాలు లభించే అవకాశం లేదన్నారు. ఢిల్లీ పిల్లలకు మెరుగైన విద్య కోసం నిజాయితీగా పనిచేశానని పేర్కొన్నారు. 'సీబీఐ అధికారులు శనివారం నా ఇల్లు, కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. లాకర్‌ను సోదా చేశారు. నా స్వగ్రామంలోనూ విచారణ చేపట్టారు. కానీ వారికి ఏమీ లభించలేదు. నేను ఏ తప్పు చేయలేదు కాబట్టి వారికి ఎలాంటి ఆధారాలు దొరకవు' అని సిసోడియా ట్వీట్ చేశారు. అయితే సిసోడియా కార్యాలయంలో సీబీఐ సోదాలు జరుగలేదని, రికార్డులు తీసుకొనేందుకే అధికారులు వెళ్లినట్లు దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి.

లలిత్‌మోదీకి కోవిడ్, న్యుమోనియా

న్యూఢిల్లీ: ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్‌మోదీ అస్వస్థతకు గురయ్యారు. కోవిడ్, న్యుమోనియాతో బాధపడుతున్న లలిత్ మోదీని లండన్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. ఈ విషయాన్ని లలిత్ మోదీ స్వయంగా సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. దీనికి సంబంధించిన ఫొటోలను మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ప్రస్తుతం తాను ఆక్సిజన్‌పై ఉన్నానని తెలిపారు. రెండు వారాల్లో తనకు మూడుసార్లు కోవిడ్ సోకిందని, దీనికితోడు తీవ్రమైన న్యుమోనియాతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. మెక్సికో సిటీ నుంచి ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్ ద్వారా మోదీ లండన్ చేరుకున్నారు. ఆయనతో పాటు ఇద్దరు వైద్యులు అంబులెన్స్‌లో వచ్చారు. మెక్సికో నగరంలో తనకు చికిత్స అందించిన వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. పన్ను ఎగవేత, మనీలాండరింగ్, ప్రసారహక్కుల కుంభకోణం ఆరోపణలు రావడంతో లలిత్ మోదీ 2010లో లండన్ పారిపోయారు.

కర్ణాటకలో బీజేపీ గెలవదు...

- అధికారంలోకి రాబోయేది జేడీ(ఎస్)
- పది రోజుల్లో అభ్యర్థుల రెండవ జాబితా ప్రకటిస్తాం
- గ్రామాల్లో 'పంచరత్న' యాత్ర జోరు - వీస్తున్న అనుకూల పవనాలు
- రాష్ట్రంలో బీజేపీ-కాంగ్రెస్ పప్పులుడకవని వ్యాఖ్య
- అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై కుమారస్వామి ధీమా

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కమలం వికసించేందుకు అవకాశం లేదని జేడీ(ఎస్) నాయకుడు హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. మోదీ పేరుతో ఓట్లు అడగడం తప్ప బీజేపీ చేయగలిగినది ఏమీ లేదని, మోదీ-అమిత్‌షా వందసార్లు రాష్ట్రానికి వచ్చినా ఒరిగేదేమీ లేదని, ప్రస్తుతమున్నంత చెత్త ప్రభుత్వం గతంలోగానీ భవిష్యత్‌లోగానీ ఉండబోదన్నారు. భారత్ జోడోపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నప్పటికీ ఫలితం ఉండదని చెప్పారు. ఆ పార్టీ ఏం చేసినా ఈసారి జేడీ(ఎస్) పార్టీనే సొంతంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. జేడీ(ఎస్) సత్తా చాటుతుందని, పాత మైసూరుకే పరిమితం కాదని, మరింత బలాన్ని పుంజుకొని మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుకూల పవనాలు వీస్తున్నట్లు తెలిపారు. 'ఈసారి కుమారన్న' (కుమారస్వామిని అభిమానులు పిలిచేది) అని ప్రజలు అంటున్నారన్నారు. సుమారుగా మే నెలలో జరిగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం 93 మంది అభ్యర్థులను తమ పార్టీ ఇప్పటికే ప్రకటించిందని, మరో 50-60 మంది అభ్యర్థుల పేర్లను పదిరోజుల్లో ప్రకటిస్తుందని ఆయనన్నారు. 'ప్రజల నాడిని తెలుసుకోగలను. సంప్రదాయం ప్రకారం పాత మైసూరు నియోజకవర్గాల్లో జేడీయూ పరిమితం అవుతుందని అనుకుంటే పొరపాటే అవుతుంది. పార్టీ విస్తరిస్తోంది. ఈసారి లక్ష్యాన్ని చేరుకోగలమన్న పూర్తి నమ్మకం ఉందని కుమారస్వామి చెప్పారు. జాతీయ పార్టీకి కాకుండా ప్రాంతీయ పార్టీకి ప్రజలు మొగ్గుచూపుతున్నారని, మోదీ-షా వందసార్లు రాష్ట్రానికి వచ్చినా కర్ణాటకలో కమలం వికసించదని జోస్యం చెప్పారు. జేడీఎస్ పార్టీ మాత్రమే చేసిన-చేయబోయే పనులతోనూ ఓట్లు అడుగుతామని కుమారస్వామి అన్నారు. తమ పార్టీని బీటీమ్ అన్న కాంగ్రెస్, బీజేపీ తమది ఏ టీమో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 6.5కోట్ల మంది టీమ్‌గా జేడీ(ఎస్) ఉందన్నారు. ఏ పార్టీతో పొత్తు లేదని, భావసారూప్యతగల పార్టీలు ముందుకొస్తే పొత్తుపై ఆలోచిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారరథ్త రథయాత్ర కొనసాగుతున్నట్లు వెల్లడించారు. పంచరత్న పేరిట అధికారంలోకి వచ్చాక నాణ్యమైన విద్య, ఆరోగ్యం, గృహాలు, రైతుల సంక్షేమం, ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. 123 సీట్లు గెలుచుకునే లక్ష్యంతో రోజు కేవలం 3 గంటలు నిద్రపోతూ 18 గంటలు పనిచేస్తున్నట్లు చెప్పారు. రోజుకు 140కిమీలు ప్రయాణిస్తూ 45 నియోజకవర్గాలను చుట్టేసినట్లు తెలిపారు. మార్చి 20 నాటికి 116 నియోజకవర్గాల్లో యాత్ర పూర్తి అవుతుందని అన్నారు.

ఉత్తర కర్ణాటకలోని రాయ్‌చూర్, విజయపుర, కలబుర్గి, బీదర్ జిల్లాల్లో తమ పార్టీ బలంగా ఉన్నదని, ఇతర పార్టీల నేతల జిల్లా-తాలూకా కేంద్రాలకు కాకుండా గ్రామాలకు వెళుతున్నట్లు వెల్లడించారు. పాత మైసూరుపై బీజేపీ దృష్టిపెట్టినా భయంలేదని, మాండ్యా జిల్లాలో మొత్తం ఏడు స్థానాల్లో జేడీ(ఎస్) గెలుపు తథ్యమని కుమారస్వామి అన్నారు. నాయకులను తయారు చేసే కర్మాగారం జేడీ(ఎస్) అని, ఎవరు వెళ్లిపోయినా బాధలేదని తమ ఎమ్మెల్యేలకు బీజేపీ, కాంగ్రెస్ గాలం వేసే అంశాన్ని ఉద్దేశించి ఆయనన్నారు. తమ పార్టీలో చేరమని ఎవరినీ ఆహ్వానించలేదని చెప్పారు. కొత్త వారికి అవకాశాలు ఇస్తున్నామని తెలిపారు. అభ్యర్థుల తొలిజాబితా ప్రకటించామని, వారం-పది రోజుల్లో రెండో జాబితా ప్రకటిస్తామన్నారు. బెంగళూరు నగరంలో 6-8 స్థానాల్లో జేడీఎస్ గెలుస్తుందని కుమారస్వామి అన్నారు. రిజర్వేషన్ అంశం, మత వ్యవహారాలను కొందరు నాయకులు దుర్వినియోగిస్తున్నారని, రాజ్యాంగానికి, చట్టానికి ప్రభుత్వం కట్టుబడాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోరాదని, జనాభా-సామాజికఆర్థికస్థితి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని రిజర్వేషన్లపై కుమారస్వామి సూచన చేశారు. శాంత్రో రవి వ్యవహారంలో బీజేపీని ఆయన విమర్శించారు. పూనేలో ఉన్న ఆయనను గుజరాత్‌కు తరలించినది ఎవరు? ఆయనకు ఏం హామీలిచ్చారు? అక్కడ ఏం జరిగింది? హోంమంత్రి అరగా జ్ఞానేంద్ర అదే సమయంలో గుజరాత్‌కు ఎలా వెళ్లారు? వంటి అనేక ప్రశ్నలు ఉన్నాయి. హోంమంత్రి దీనిపై ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాలి... నా వద్ద సమాచారం ఉందిగానీ ఆధారాలు లేవు' అని కుమారస్వామి అన్నారు. ప్రస్తుతం ఉన్నంత చెత్త ప్రభుత్వం గతంలో లేదు... భవిష్యత్‌లో ఉండబోదన్నారు. కాగా మానవ అక్రమ రవాణా, నేతలతో సాన్నిహిత్యం, పోలీసుల బదిలీల్లో జోక్యం వంటి ఆరోపణలను ఎదుర్కొంటున్న కేఎస్ మంజునాథ్ అలియాస్ శాంత్రో రవి శుక్రవారం అహ్మదాబాద్‌లో అరెస్టు అయ్యారు.

జమ్ములో పీఎఫ్ సిబ్బందికి సైకిళ్లు

జమ్ము: జమ్మును కర్బన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా తమ ఉద్యోగులకు స్థానికంగా వినియోగించుకోవడానికిగాను సైకిళ్లు ఇవ్వాలని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ(ఈపీఎఫ్ఓ) నిర్ణయించింది. తమ ఉద్యోగులకు సైకిళ్లు ఇవ్వాలని 50 ఏళ్ల వయసు గల పీఎఫ్ కమిషనర్ రిజ్వాన్ ఉద్ దిన్ నిర్ణయం తీసుకున్నారు. హానికరమైన ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ఈపీఎఫ్ఓ ముందుకు వచ్చింది. జమ్ము, కశ్మీరు, లదఖ్‌లోని ఈపీఎఫ్ఓ కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు సైతం ఈ దిశగా ముందుకు సాగుతున్నాయి. సిబ్బంది సంక్షేమం, రవాణా రద్దీ, పర్యావరణ సమస్యలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని...సిబ్బంది సంక్షేమ కమిటీ ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు రిజ్వాన్ ఉద్ దిన్ చెప్పారు. సిబ్బంది అంతా ఇక నుంచి ఇంటికి, కార్యాలయానికి సైకిల్ మీదే ప్రయాణిస్తారని చెప్పారు. తమ కార్యాలయానికి బెస్టు రిమోట్ ఆఫీస్ అవార్డు వచ్చిందని, దీనిద్వారా రూ.5 లక్షల నగదు బహుమతి ఇచ్చారని, ఈ మొత్తాన్ని సైకిళ్ల కొనుగోలుకు వినియోగిస్తున్నట్లు రిజ్వాన్ చెప్పారు.

మావోయిస్టుల బాంబుదాడిలో ఏఎస్ఐకి గాయాలు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన శక్తివంతమైన బాంబులు పేలి సీఆర్‌పీఎఫ్‌కి చెందిన ఏఎస్ఐ శనివారం తీవ్రంగా గాయపడ్డారు. తర్రెం పోలీసు స్టేషన్ పరిధిలో గల పెగడపల్లి గ్రామసమీపంలో ఉదయం 8:45 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. వెంటనే అప్రమత్తమైన బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నట్లు సీనియర్ పోలీసు అధికారి వివరించారు. గాయపడిన ఏఎస్ఐ మహమ్మద్ అస్లాంను బాసగుడ ఫీల్డ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

దిల్లీలో మరో దారుణం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణం చోటుచేసుకుంది. రాజౌరి గార్డెన్ ఏరియాలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారుతో కొందరు ఢీకొట్టారు. ఆ వ్యక్తి ఎగిరి కారు బానెట్‌పై పడిపోవడంతో అలానే ఈడ్చుకెళ్లారు. పైగా వాహనాల రద్దీ బాగా ఉన్న రోడ్డుపై ఇలాంటి ఘటన జరగడం అత్యంత విచారకరం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఇండియన్ పీనల్ కోడ్‌లోని 279, 323, 341, 308 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, కంఝావాలా ఏరియాలో ఈ నెల 1న అర్ధరాత్రి ఐదుగురు వ్యక్తులు స్కూటీపై వెళ్తున్న అంజలి అనే 20 ఏళ్ల యువతిని కారుతో ఢీకొట్టారు. యువతి కారులో ఇరుక్కుపోయినా ఆపకుండా 12 కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లారు. దాంతో యువతి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆ ఘటనను మరువక ముందే అలాంటిదే మరో ఘటన తాజాగా చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

పేదల ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం

దిల్లీ బీజేపీ కార్యాలయం వద్ద ఆప్ ధర్నా

న్యూఢిల్లీ: ఢిల్లీ బీజేపీ కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కార్యకర్తలు శనివారం ధర్నా చేశారు. ధౌలాకాన్ ప్రాంతంలోని మురికివాడల ధ్వంసం చేయాలని ప్రజాపనులశాఖ(పీడబ్ల్యూడీ) ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లోగా ఈ భూమిని ఖాళీ చేయాలని ధౌలాకాన్ ప్రాంతంలోని మురికివాడ వాసులకు డిసెంబరు 29న పీడబ్ల్యూడీ నోటీసులిచ్చింది. ఏ ఒక్కరి ఇల్లు కూల్చివేతకు తమ పార్టీ అంగీకరించబోదని ఆప్ ఎమ్మెల్యే సోమనాథ్ భారతి చెప్పారు. 'హేమ్‌పై ఏమి చేస్తోంది? ఢిల్లీ ప్రజలకు వ్యతిరేకంగా ఎందుకు చర్యలు తీసుకుంటుంది?' అని ప్రశ్నించారు. ఇళ్ల కూల్చివేత ఉత్తర్వులకు వ్యతిరేకంగా తమ పార్టీ వీధి పోరాటంతో పాటు పార్లమెంటు దృష్టికి కూడా తీసుకువెళ్తుందని ఆప్ ఎమ్మెల్యే ఆదిల్ అహ్మద్ చెప్పారు. ఎక్కడైతే ఇళ్లు కూల్చివేస్తామో...అక్కడే నిర్వాసితులకు కొత్త ఇళ్లు ఇస్తామని బీజేపీ తన మేనిఫెస్టోలో చెప్పిందని, ఇప్పుడేమో మురికివాడల కూల్చివేతకు ఆదేశాలివ్వడం విడ్డూరమని ఆయన విమర్శించారు. కూల్చివేత ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వం పీడబ్ల్యూడీకి నోటీసులు ఇచ్చింది. శీతాకాల సమయంలో భయంకరమైన చలితీవ్రత ఉండగా ఇళ్లు కూల్చివేతకు ఉత్తర్వులు ఇవ్వడం అమానవీయమని ఢిల్లీ ప్రభుత్వం మండిపడింది. స్థానికులకు కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడమేమిటని నిలదీసింది. ధౌలాకాన్ ప్రాంతంలోని మురికివాడల్లో గల ఇళ్లు కూల్చివేత ఉత్తర్వులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడబ్ల్యూడీ అధికారులను ఆదేశించినట్లు ఆ శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇటీవల ట్వీట్ చేశారు. ప్రత్యామ్నాయ ఇళ్లు చూపించకుండా చలికాలంలో పేదల ఇళ్లు కూల్చివేతను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తేలేదని సిసోడియా స్పష్టంచేశారు. 'పేదల ఇళ్లు కూల్చివేత నిర్ణయానికి కేజ్రీవాల్ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతివ్వబోదని తేల్చిచెప్పారు.

వచ్చే జనవరిలో రామమందిరం ప్రారంభం
ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడి

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో చేపట్టిన రామమందిర వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభంకానుంది. రామమందిర దేవాలయ నిర్మాణ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ఆలయ నిర్మాణం శరవేగంగా సాగుతోందని, చాలా పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని, ఈ ఏడాది చివరినాటికి పనులు పూర్తి చేస్తామని, వచ్చే ఏడాది జనవరి నాటికి శ్రీరాముడిని దర్శించుకునే భాగ్యం భక్తులకు కల్పిస్తామని చెప్పారు. సూర్యోదయం కిరణాలు విగ్రహంపై పడేలా గర్భగుడికి రూపకల్పన చేసినట్లు చెప్పారు. 'దేశం మొత్తం జోడీగా ఈనాడు జరుపుకుంటోంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. రామమందిరాన్ని నిర్మించాలనే మా లక్ష్యంలో సగానికి పైగా సాధించాం. 2024లో సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయంలో గర్భగుడిలో శ్రీరాముడి విగ్రహాలను ప్రతిష్టిస్తాం. భక్తుల సందర్శనార్థం జనవరి 2024లో ఆలయాన్ని ప్రారంభిస్తాం' అని రాయ్ చెప్పారు. కాగా, ఆలయం గ్రౌండ్ ఫ్లోర్ పనులు ఇప్పటికే సగం దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆగస్టు నాటికి గర్భగుడి కింది అంతస్తు పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి 2020 ఆగస్టు 5న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. గర్భగుడి చుట్టూ 40 కిలోల వెండి ఇటుకలను స్థాపించారు. మూడు అంతస్తుల్లో, ఐదు మండపాలుగా చేపడుతున్న రామాలయ నిర్మాణానికి సుమారు రూ.1800 కోట్లు ఖర్చవుతాయని ట్రస్టు సభ్యులు వెల్లడించారు. అహ్మదాబాద్‌కు చెందిన టెంపుల్ ఆర్కిటెక్ట్ 'సోమ్‌పురా ఫ్యామిలీ' అయోధ్య రామ మందిర నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది.

'జోషీమఠ్‌'పై ఇస్రో నివేదిక మాయం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం జోషీమఠ్ కుంగిపోతున్న విషయం తెలిసిందే. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో భూమి కోతకు గురికావడం, పగుళ్లతో భయానక పరిస్థితి నెలకొంది. పట్టణంలో మొత్తంగా దాదాపు 4,500 భవనాలు ఉండగా ఇప్పటివరకు 723భవనాలకు పగుళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే, పట్టణంపై భారత అంతరిక్ష సంస్థ ఓ కొత్త నివేదికను విడుదలచేసిన విషయం తెలిసిందే. డిసెంబర్ 27వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు అంటే 12 రోజుల్లోనే జోషీమఠ్ పట్టణం 5.4 సెంటీమీటర్ల మేర కుంగిపోయినట్లు ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తన నివేదికలో పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఈ నివేదిక ఇస్రో వెబ్ సైట్‌లో కనిపించడంలేదు. నివేదికకు సంబంధించిన లింక్‌ను ఇస్రో తొలగించింది. ఈ తరుణంలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. జోషీమఠ్ కుంగుబాటుపై ప్రభుత్వ రంగ సంస్థలు సొంతంగా విడుదల చేస్తున్న నివేదికలు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని తెలిపింది. స్థానికులతో పాటు దేశవ్యాప్తంగా ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించేలా ప్రకటనలు చేస్తున్నట్లు పేర్కొంది కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన ఉన్నతస్థాయి భేటీలో చర్చకు వచ్చిందని తెలిపింది. దీంతో ఈ విషయాన్ని నేరుగా మీడియాతో మాట్లాడొద్దంటూ శాస్త్రవేత్తలకు ప్రభుత్వం సూచించినట్లు వివరించింది.

ఎవరేమన్నా... నా పని నాదే: శశిథరూర్

కన్నూర్: ఎవరు ఏమనుకున్నాగానీ తన పనిని తాను చేసుకుపోతానని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ శనివారం స్పష్టంచేశారు. 14ఏళ్లుగా చేసినదే ఇప్పుడూ చేస్తానని, పనిలో భాగంగా ప్రజలను కలుస్తానన్నారు. కొంత కాలంగా కేరళ ముఖ్యమంత్రి అభ్యర్థి శశిథరూర్ అని ప్రచారం జరుగుతుండటం, సొంత పార్టీ నేతలే పరోక్ష విమర్శలు చేస్తుండటంపై విలేకరులు ప్రశ్నించగా శశిథరూర్ పై విధంగా స్పందించారు. తిరువనంతపురం ఎంపీగా కేరళ రాష్ట్రంలో జరిగే అనేక కార్యక్రమాలకు హాజరవుతుంటానని, ఇందులో ప్రత్యేకమేమీ లేదని, చాలా మంది నేతలు చేసేదేనని థరూర్ అన్నారు. కాంగ్రెస్ నేతల విమర్శలనుద్దేశించి 'ఎవరు ఏమనుకున్నా... చెప్పినా... పట్టించుకోను... నా పనిని నేను చేసుకుపోతా' అని అన్నారు. 2026లో జరగబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై శశిథరూర్ ఆసక్తి కనబరుస్తున్నట్లు పార్టీ సీనియర్ నేత రమేశ్ చెన్నితల వంటివారు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. 'సీఎం పదవి కోసం కోటు కుట్టించుకున్నారు. దానిని వదిలి రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషిచేయాలి' అని థరూర్‌నుద్దేశించి చెన్నితల పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నాలుగేళ్ల తర్వాత ఎవరికి ఏ పదవి అన్నది ఇప్పుడే ప్రకటించకోరాదన్నారు. ఈ పరిణామంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అసహనం వ్యక్తంచేశారు. ఇలాంటివి పార్టీ ఫోరాల్లో చర్చించుకోవాలేగానీ బహిరంగంగా కాదని, దీనిపై చర్చించేందుకు మీడియాకు అవకాశమివ్వరాదని నేతలకు సూచించారు. సీఎం కోటు వ్యాఖ్యపై శశిథరూర్ స్పందిస్తూ 'సాధారణంగా మన ముఖ్యమంత్రులు కోట్లు ధరించరు. ఎవరు కోటు కుట్టారో... కుట్టించుకున్నారో తెలియదు. ఆ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారని మీరు ఆయనినే అడగాలి నన్ను కాదని అన్నారు.

విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

చెన్నై: తమిళనాడులో ఓ కాలేజీ విద్యార్థిని గ్యాంగ్ రేప్‌కు గురైంది. ఆమె స్నేహితుడి ముందే అయిదుగురు వ్యక్తులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. కాంచీపురంలో ఈ ఘటన జరిగింది. గురువారం రాత్రి ఏడు గంటలకు ఓ నిర్మానుష ప్రదేశంలో ఇద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో అక్కడకు చేరుకున్న ఐదుగురు ఆకతాయిలు వాళ్లను చుట్టుముట్టారు. అబ్బాయిని కత్తితో బెదిరించిన ఆ గ్యాంగ్.. విద్యార్థినిపై అత్యాచారంచేశారు. ఒకవేళ ఒప్పుకోకుంటే హత్య చేస్తామని కూడా ఆ అమ్మాయిని బెదిరించారు. ఆ గ్యాంగ్ నుంచి తప్పించుకున్న ఇద్దరూ బంధువుల ఇంటికి వెళ్లారు. విద్యార్థినిని హాస్పిటల్‌లో చేర్పించారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. దీనికోసం ఉండడం వల్ల ఆ గ్యాంగ్‌ను గుర్తుపట్టలేకపోయామని తెలిపారు. అయితే, ఒక వ్యక్తి విమల్ అని పిలవడం గమనించినట్లు విద్యార్థిని పోలీసులకు తెలిపారు. దాంతో విపాడు గ్రామంలో ఉన్న విమల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా మరో నలుగురిని పట్టుకున్నారు. మణికండన్, శివకుమార్, విఘ్నేశ్, తెన్నారసులను అదుపులోకి తీసుకున్నారు.

లక్షద్వీప్ ఎంపీ మహ్మద్ ఫైజల్‌పై అనర్హత వేటు

న్యూఢిల్లీ: కేంద్రపాలిత ప్రాంతం లక్షద్వీప్ ఎంపీ మహ్మద్ ఫైజల్‌పై అనర్హత వేటు పడింది. హత్యాయత్నం కేసులో దోషిగా తేలడంతో కవరట్టీ సెషన్స్ కోర్టు ఆయనకు పదేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో ఆయనపై లోక్‌సభ స్పీకర్ అనర్హత వేటు వేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరి 11వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 102(1) (ఇ) ప్రకారం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి చెందిన మహ్మద్ ఫైజల్ 2014 నుంచి ఎంపీగా ఉన్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ అల్లుడైన పదనాథ్ సాలిహ్‌పై కొంత మంది వ్యక్తులతో కలిసి ఫైజల్ హత్యాయత్నం చేశారు. పదునైన ఆయుధాలతో దాడిచేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఈ ఘటనపై నమోదైన కేసును కవరట్టీ సెషన్స్ కోర్టు విచారించింది. రాజకీయ కక్షతోనే సాలిహ్‌ను హత్య చేయడానికి కుట్రపన్నారని, అయితే అందుకు వారు విఫలమయ్యారని కోర్టు స్పష్టం చేసింది. నిందితులకు పదేళ్ల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించింది.

కాంగ్రెస్ ఎంపీ చౌదరి కన్నుమూత

జోడోయాత్రలో అకస్మాత్తుగా కుప్పకూలిన ఎంపీ
రాహుల్, ఖర్గే, మాన్ సంతాపం
నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

చండీగఢ్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రలో విషాదం చోటు చేసుకుంది. పంజాబ్‌లో జోడోయాత్రలో పాల్గొన్న జలంధర్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి (76) శనివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. పంజాబ్‌లోని ఫిలింనగర్‌లో జరుగుతున్న జోడోయాత్రలో ఎంపీ సంతోఖ్‌సింగ్ పాల్గొన్నారు. పాదయాత్రలో నడుస్తుండగా... అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఆయన్ని హుటాహుటిన ఫగ్వారాలోని ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఎంపీ మృతి చెందారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రను నిలిపివేసి...ఆసుపత్రికి చేరుకున్నారు. సంతోఖ్‌సింగ్ ఆకస్మిక మృతి వల్ల జోడోయాత్రను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎంపీ మృతిపై రాహుల్‌గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సంతోఖ్‌సింగ్ కష్టపడే మనస్తత్వం గల నాయకుడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని వ్యాఖ్యానించారు. కుప్పకూలిన సంతోఖ్‌సింగ్ చౌదరిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం అక్కడి నుంచి చౌదరి భౌతికకాయాన్ని జలంధర్‌లోని ఆయన నివాసానికి తరలించారు. పంజాబ్‌లో రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్ర చేస్తూ చౌదరి కుప్పకూలారు.

సంతోఖ్‌సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంతాపం తెలిపారు. చౌదరి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఖర్గే ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ కూడా ఎంపీ మృతికి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోయిందని యాత్రలో పాల్గొన్న పార్టీ సీనియర్ నేత ప్రతాప్‌సింగ్ బాజ్వా పేర్కొన్నారు. ఆయన కుమారుడు, ఎమ్మెల్యే విక్రమ్ చౌదరి, కుటుంబ సభ్యులు, మిత్రులకు సానుభూతి తెలిపారు.

యాత్రలో తనను ఎలా ఉన్నావని పలకరిస్తూనే కుప్పకూలారని తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి తనకు చెప్పారని కాంగ్రెస్ పంజాబ్ అధ్యక్షుడు అమరేందర్‌సింగ్ రాజా విలేకరులకు చెప్పారు. రాహుల్ యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారని, జోడో జోడో...భారత్ జోడో అంటూ నినాదాలు చేశారని తెలిపారు. తన నియోజకవర్గం మీదుగా రాహుల్ యాత్ర వస్తుండడంతో చౌదరి చాలా ఉత్సాహంగా ఉన్నారని, చౌదరి కుటుంబం సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో కలిసి నడుస్తోందని తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు తన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. చౌదరి మృతితో జోడో యాత్రను 20 గంటలు నిలిపివేశామని, తిరిగి ఆదివారం సాయంత్రం ప్రారంభిస్తామని జైరాం రమేశ్ చెప్పారు. ఆదివారం జరగాల్సిన రాహుల్ విలేకరుల సమావేశం కూడా 17వ తేదీన హోషియార్‌పూర్‌లో నిర్వహిస్తామని చెప్పారు.

దళిత కుటుంబంలో జన్మించిన సంతోఖ్‌సింగ్ చౌదరి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయనకు రాజకీయ కుటుంబమే. ఆయన తండ్రి మాస్టర్ గుర్బంత సింగ్ గొప్ప దళిత నాయకుడు. విద్యావేత్త, పంజాబ్ వ్యవసాయమంత్రిగా పనిచేశారు. చౌదరి సోదరుడు చౌదరి జగ్జిత్‌సింగ్ మంత్రిగా పనిచేస్తున్నారు. చౌదరి కుమారుడు ప్రస్తుతం శాసనసభ్యుడు. జలంధర్ జిల్లా కర్తార్‌పూర్ సమీపంలోని ధలివాల్‌లో చౌదరి జన్మించారు. చౌదరి మృతికి కాంగ్రెస్, బీజేపీ, ఆప్ సహా అనేక పార్టీల నేతలు సంతాపం ప్రకటించారు.

శరద్ యాదవ్‌కు అంతిమ వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

భోపాల్: జేడీ(యూ) మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్‌కు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, అభిమానులు అంతిమ వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో శనివారం సాయంత్రం 5గంటలప్పుడు ముగిశాయి. మధ్యప్రదేశ్, నర్మదాపురం జిల్లాలోని యాదవ్ స్వగ్రామమైన అంకుమౌలో అంతిమ సంస్కారాలు జరిగాయి. కుమారుడు శాంతను, కుమార్తె సుభాషిణి కలిసి ఆయన చితికి నిప్పంటించారు. దిల్లీ నుంచి చార్టెర్డ్ విమానంలో భోపాల్‌కు, అక్కడ నుంచి 100కిమీల దూరంలో ఉన్న అంకుమౌ గ్రామానికి రోడ్డుమార్గంలో యాదవ్ భౌతికకాయాన్ని తరలించారు. విమానాశ్రయానికి చేరుకున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ తదితరులు యాదవ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భోపాల్ విమానాశ్రయం నుంచి అంకుమౌ గ్రామానికి యాదవ్ భౌతికకాయంతో పాటు దిగ్విజయ్ సింగ్ వెళ్లారు. చౌహాన్ విమానాశ్రయం వద్ద విలేకరులతో మట్లాదారు, యాదవ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఇద్దరం ఇరుగుపొరుగు ఊర్ల వారమన్నారు. జేపీ ఉద్యమంలో యాదవ్ కీలకమని, చిన్నతనం నుంచే అన్యాయాన్ని ఎదిరించేవారన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ పటేల్ మాట్లాడుతూ, విద్యార్థి రాజకీయాలనే కాకుండా జబల్‌పూర్‌లో పార్టీ రాజకీయాల్లోనూ ప్రతిష్ఠాత్మకంగా యాదవ్ వ్యవహరించారని చెప్పారు. తమ మధ్య సిద్ధాంతాలపరంగా విభేదాలు ఉండొచ్చుగానీ వ్యక్తిగతంగా కాదన్నారు. అంకుమౌ గ్రామంలో యాదవ్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేత నీఖ్రా, కేంద్ర మాజీమంత్రి సురేశ్ పచౌరి, ఎంపీ రావ్ ఉదయ్ ప్రతాప్ సింగ్ తదితరులు ఉన్నారు.

జోషిమఠ్, కర్ణప్రయాగ్ పరిస్థితులపై

అఖిలపక్షాన్ని పిలవండి

కేంద్రానికి సీపీఐ సూచన

న్యూదిల్లీ: ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాలు కుంగిపోతుండటంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆందోళన వ్యక్తంచేసింది. జోషిమఠ్, కర్ణప్రయాగ్ పరిస్థితులను అంచనా వేసేందుకు, అక్కడి ప్రజలకు పునరావాసం కల్పన, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించేందుకు వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వానికి పార్టీ జాతీయ కార్యదర్శివర్గం శనివారం ఒక ప్రకటనలో సూచించింది. జోషిమఠ్, కర్ణప్రయాగ్‌లో ఇళ్లు కూలిపోతుండటంపై ఆవేదన వ్యక్తం చేసింది. బండరాళ్లులేని కొత్త పర్వతాలున్న హిమాలయ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులను ఆచితూచి ఎంపిక చేయాలని సూచించింది. అక్కడి పర్యావరణ పరిస్థితులు, సుస్థిరత, పర్వతాల సున్నితత్వాన్ని ప్రస్తుత కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని, పర్యవసానంగా తీవ్ర నష్టం జరుగుతోందని, తక్షణమే పరిస్థితులకు తగ్గట్లు దిద్దుబాటు చర్యలు చేపట్టాలని హితవుపలికింది. బాధితులకు ఇచ్చిన పరిహారం సముచితంగా లేదని, ప్రజల అవసరాలు, అభిప్రాయాలకు అనుగుణంగా పునరావాస ప్రణాళికలు ఉండాలని పేర్కొంది. పర్యావరణ పరిస్థితులను పట్టించుకోకుండా అభివృద్ధి ప్రాజెక్టులతో ముందుకెళితే ఎలాంటి పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నదానికి జోషిమఠ్, కర్ణప్రయాగ్ పరిణామాలే హెచ్చరికలని సీపీఐ నొక్కిచెప్పింది. అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టే సమయాల్లో పర్యావరణ సుస్థిరతను దృష్టిలో ఉంచుకోవాలని సీపీఐ కోరింది. భవిష్యత్ ప్రణాళికలు, ప్రస్తుత పరిస్థితులపై చర్చ కోసం అన్ని పార్టీలతో భేటీని ఏర్పాటు చేయాలని కేంద్రానికి విన్నవించింది.

అన్ని రంగాల్లో యువత రాణించాలి

సురవరం సుధాకరరెడ్డి పిలుపు

విశాలాంధ్ర- హైదరాబాద్: విద్యార్థులు, యువత అన్ని రంగాల్లో రాణించాలని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాఠ్యేతర కార్యక్రమాలకు స్థలం లేకుండా అపార్ట్‌మెంట్ భవనాల్లో పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడులో నిర్వహించిన గద్వాల్ యువజనోత్సవాలు- 2023ను శనివారం సురవరం జెండా ఊపి ప్రారంభించారు. సురవరం వెంకట్రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్, సోషల్ ప్రోగ్రెస్ సంయుక్తంగా యేటా యువజనోత్సవాలు నిర్వహిస్తాయి. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోతే విద్యార్థులు మానసికంగా రాటుదేలటం కష్టంగా ఉంటుందని, ప్రస్తుత విద్యా విధానం భావితరాల శారీరక, మానసిక సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్, సోషల్ ప్రోగ్రెస్ సెక్రటరీ సురవరం కపిల్ మాట్లాడుతూ యువజనోత్సవాల కోసం రూపొందించిన మౌలిక సదుపాయాలు ఏడాది పొడవునా యువతకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. వీటిని ఉపయోగించుకొని యువత క్రీడలపై కసరత్తు చేస్తోందని చెప్పారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో యువత పాల్గొంటున్నట్లు తెలిపారు. తొలిరోజు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, వ్యాసరచన, డ్రాయింగ్, పెయిం టింగ్ పోటీలు జరిగాయి. రానున్న మూడు రోజుల్లో 25 రకాల ఆటలు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ కంచుపాడు అధ్యక్షుడు వీరాంజనేయులు తెలిపారు. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని ఏఐవైఎఫ్ కంచుపాడు కార్యదర్శి శివ తెలిపారు.

ఈపీఎఫ్ పోర్టల్‌లో సమస్యలు

న్యూదిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్) పోర్టల్‌లో అంతరాయం ఏర్పడింది. దీంతో చందాదారులకు చుక్కలు చూపిస్తోంది. గత కొన్ని రోజులుగా ఈపీఎఫ్ ఇ-పాస్‌బుక్ సేవలు నిలిచిపోవడంతో చందాదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈపీఎఫ్ఓ పోర్టల్‌లోని ఇ-పాస్ బుక్ విభాగానికి వెళ్లినప్పుడు సాయంత్రం 5 గంటల తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయని చూపిస్తోంది. గత కొద్ది రోజులుగా ఇదే సందేశం కనిపిస్తుండడంతో చందాదారులు సమాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్నారు. శనివారం (జనవరి 14న) మధ్యాహ్నం 12.30 గంటల సమయంలోనూ ఆ పోర్టల్‌లో అదే సందేశం కనిపిస్తోంది. గతేడాది సైతం కొన్నిరోజుల పాటు ఇ-పాస్‌బుక్ సేవల్లో అంతరాయం ఏర్పడింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.